# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక వార్త





## 18న శ్రీచెంగాళమ్మకు శాకాంబరి అలంకారం



సూళ్లూరుపేట, జులై 14 ప్రభాతవార్త

సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాత పరమేశ్వరి దేవస్థానంలో అమ్మణ్ణికి ఆషాఢ బహుళ అష్టమి సందర్భంగా ఈ నెల 18వ తేదీన శాకాంబరి అలంకారం చేయనున్నట్లు దేవాదాయశాఖ సహాయ కమిషనర్ బి.ప్రసన్నలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె విలేఖరులతో మాట్లాడుతూ శాకాంబరి అలంకారాన్ని అమ్మణ్ణికి ఆషాఢ మాసంలో చేయడం ఆనవాయితీగా కొనసాగుతుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నెల 18న శాకాంబరి అలంకారం చేయనున్నట్లు చెప్పారు. ఈ అలంకారం చేసేందుకు భక్తులను భాగస్వాములు చేసే ప్రక్రియలో భాగంగా మూడు రకాల కూరగాయలు, రెండురకాల పండ్లు ఈ నెల 16వ తేదీలోగా ఆలయ సిబ్బందికి భక్తులు చేర్చాల్సి ఉంటుందన్నారు. వీటిని ఉపయోగించి అమ్మణ్ణికి అలంకారం చేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే ఆగస్టు 1వ తేదీన అమ్మవారికి పుష్పయాగం, 22న సామూహిక వరలక్ష్మీ వ్రతం చేయనున్నట్లు ప్రసన్నలక్ష్మి తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆమె కోరారు.

## అర్జీలు పునరావృతం కాకుండా చూడాలి

### - జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్



తిరుపతి కలెక్టరేట్, జూలై 14 ప్రభాతవార్త : పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను పునరావృతం కాకుండా చూడాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 301 అర్జీలు అందాయి. అర్జీ దారులకు అన్ని వసతులను కల్పించడంతో పాటు వారి సమస్యలను సావధానంగా వింటూ అర్జీలను స్వీకరించారు. నిర్దేశించిన గడువు లోపు అర్జీలను పరిష్కరించాలని సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, శివశంకర్, నాయక్, సుధారాణి, రోజ్‌మాడ్ తదితరులు పాల్గొన్నారు.

### క్రోమో కర్మాగారంలో

## భారీ అగ్ని ప్రమాదం

### పేలిన ప్రెజర్ నాట్చే ఫిల్టర్ యంత్రము
### ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలు





ప్రమాదంలో గాయపడిన కార్మికులు, పరిస్థితులను సమీక్షిస్తున్న అధికారులు.

.రేణిగుంట జూలై 14 ప్రభాతవార్త

రేణిగుంట మండలం గాజులమండ్యం పారిశ్రామిక వాడలో సోమవారం ఘోర అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. పారిశ్రామిక వాడలోని క్రోమో మెడికేర్ ఫార్మాసిటికల్ కంపెనీ (కర్మాగారం) నందు మధ్యాహ్నం భోజనం విరామ సమయంలో ప్రెషర్ నాట్చే ఫిల్టర్ యంత్రము పెద్ద శబ్దంతో పేలింది. ఈ ప్రమాదంలో ఒక్కసారి ఉవ్వెత్తున మంటలు ఎగిసిపడ్డాయి. కర్మాగారంలో భోజనాలు చేస్తున్న కార్మికులు భయంతో పరుగులు తీశారు. భోజన విరామ సమయం కావడంతో యంత్రం వద్ద ఇద్దరు కార్మికులు మాత్రమే ఉన్నారు. పేలుడు ధాటికి ఇద్దరు కార్మికులు దాదాపు 90 శాతం కాలిపోయారు. వీరిని తెలంగాణ రాష్ట్రానికి చెందిన డి రవీంద్ర, రేణిగుంట మండలం గాజులమండ్యం గ్రామంలో నివసిస్తున్న వెంకటేష్ గా గుర్తించారు. గాయపడిన వారిని వెంటనే చికిత్స నిమిత్తం దగ్గర్లోని ఓ కార్పొరేట్ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న వెంటనే తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరావు, రూరల్ సీఐ మంజునాథరెడ్డి, గాజులమండ్యం ఎస్సై సుధాకర్ తమ సిబ్బందితో పుటాహుటిన సంఘటన స్థలం చేరుకొని జరిగిన ప్రమాదంపై ఆరా తీశారు. శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి అక్కడకు వచ్చి పరిస్థితులను సమీక్షించారు.అప్పటికే అక్కడికి చేరుకున్న ఫైర్ ఇంజన్లు మంటలను అదుపు చేశాయి.

### తిరుపతిలో ఎక్స్‌ప్రెస్ రైల్లో

## ఎగిసిన మంటలు



### హిసార్ ఎక్స్‌ప్రెస్ ఒకబోగీ పూర్తిగా దగ్ధం
### రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ముప్పు

తిరుపతి,జూలై 14ప్రభాతవార్త:

నిత్యం ప్రయాణీకులతో రద్దీగా ఉండే తిరుపతి రైల్వేస్టేషన్‌కు సమీపంలో లూప్‌లైన్ పట్టాలపై షంటింగ్ కోసం ఆగివున్న హిసార్ (షిర్డీ)ఎక్స్‌ప్రెస్‌రైలు (04717)బోగీల్లో మంటలు వ్యాపించాయి. ఇంజిన్‌కు వెనుకవైపు ఉన్న జనరల్‌బోగీల్లో మంటలు చెలరేగాయి. సోమవారం మధ్యాహ్నం జరిగిన ఈ అకస్మాత్తు సంఘటనతో రైల్వేఓవర్‌బ్రిడ్జిపై వెళుతున్న వాహనదారులేగాక పరిసరాల్లోనే ఉన్న నివాసస్థులు,ఓ హోటల్‌లోని జనం భయంతో బయటకు పరుగులుతీశారు. ఆందోళన చెందారు. తిరుపతి రైల్వేస్టేషన్ నుండి రేణిగుంట వైపు వెళ్లే ఔటర్ సిగ్నల్ ట్రాక్‌పై రైల్లో ఈ మంటలు చెలరేగాయి. అదృష్టవశాత్తు అప్పటికే ప్రయాణీకులను స్టేషన్‌లో దించేయడంతో భారీ ప్రాణనష్టం తప్పింది. సంఘటన సమాచారం తెలిసిన వెంటనే రైల్వే ఉన్నతాధికారులు, ఈస్టు పోలీసులు, రైల్వే జీఆర్‌పి,ఆర్‌పిఎఫ్ పోలీసులు,అగ్నిమాపకశాఖ సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపుచేశారు. ఈ సమయంలో మరో ట్రాక్‌పై తిరుపతి-సికింద్రాబాద్ రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైలు ఆగిఉంది. ఆ రైలు ఇంజిన్‌కు మంటలు వ్యాపించినా సకాలంలో ఆర్పివేశారు. అసలు తిరుపతి రైల్వేస్టేషన్ చరిత్రలోనే రైలుకు మంటలు వ్యాపించడం మిస్టరీగా మారింది. రైలు ఇంజిన్‌కూడా ఆపివేసిన సమయంలో అకస్మాత్తుగా మధ్యాహ్నం సమయంలో మంటలు చెలరేగడంతో అక్కడ ఏం జరుగుతుందో తెలియని ఆందోళనకర పరిస్థితి నెలకొంది. మంట ల్లో హిసార్ ఎక్స్‌ప్రెస్ ఇంజిన్‌కు వెనుకనే ఉన్న స్లీపర్‌క్లాస్ బోగీల్లో ఒకటి పూర్తిగా దగ్ధమైంది. పక్కనే ఉన్న మరో రెండు బోగీలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. హిసార్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రయాణీకులను సోమవారం ఉదయం 11.50గంటల సమయంలో స్టేషన్‌లో దించేసిన తరువాత కొంతదూరం ముందుకెళ్ళి పట్టాలపై ఆగింది. అక్కడ నుండి వెనక్కు రైల్వే గ్యారేజీ వైపు షంటింగ్‌కు రావల్సి న రైలుబోగీల్లో మధ్యాహ్నం 1.30-2గంటల ప్రాంతంలో మంటలు వ్యాపించడం అనుమానాలకు తావిస్తోంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది రెండు అగ్నిమాపక వాహనాలతో అక్కడకు చేరుకుని రైల్వే సిబ్బంది, స్థానికుల సాయంతో మంటలను అదుపుచేశారు. రైలు బోగీల్లో ప్రయాణీకులు ఎవరూ లేపోకవడంతో పెద్దప్రాణనష్టం తప్పింది. సకాలంలో మంటలను అదుపుచేయడంతో ఇతర బోగీలకు మంటలు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. వెంటనే ఇంజిన్‌ను బోగీల నుండి తప్పించారు. సోమవారం సాయంత్రం 5.30గంటలకు తిరుపతి రైల్వేస్టేషన్ నుండి రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైలు యధావిధిగా బయలుదేరింది.షంటింగ్‌కు రావడానికి కొద్దినిమిషాలకే బోగీల్లో మంటలు వ్యాపించడంతో ఇది ప్రమాదమేనా? లేక ఎవరైనా అగ్గిపెట్టారా అనేది రైల్వేశాఖ ఇంజనీర్లు, రైల్వే ఉన్నతాధికారులు, ఆర్‌పిఎఫ్ విభాగం దర్యాప్తు చేపడుతోంది. ఒక రోజుకు ముందు తమిళనాడు తిరువళ్ళూరువద్ద పట్టాలపై గూడ్స్ రైలుబోగీలు మంటలువ్యాపించి తగలబడిన ఉదంతం తెలిసిందే.

## బ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతున్న తిరుమల



ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:

ఏడుకొండలు దేవదేవుని సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు సిద్ధమవుతున్నాయి. దేవుని ఉత్సవాలకు అశేషంగా భక్తులు తరలివస్తారనే ముందుచూపుతో అన్ని విధాలా అవసరమైన ఏర్పాట్లు, సౌకర్యాలు,గ్యాలరీలు నిర్మాణం, మాఢవీధుల్లో ఎండకు.వానకు రక్షణగా చలువపందిళ్ళు, జర్మన్‌షెడ్లు వేసేందుకు ఇంజనీరింగ్ పనులు ఆదివారం మొదలయ్యాయి. తొలుత ఉత్తరమాఢవీధినుండి ఈ పనులు శ్రీకారంచుట్టారు. సెప్టెంబర్ 24 నుండి తొమ్మిదిరోజులు ఆలయమాఢ వీధుల్లో వివిధ రకాల వాహనసేవల్లో స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. మాఢవీధుల్లో గ్యాలరీలు ఏర్పాటుచేసే పనులు ఇంజనీరింగ్ చేపడుతోంది.

## స్వర్ణరథంపై అలరించిన విఘ్ననాథుడు



కాణిపాకం, జూలై 14 ప్రభాతవార్త:

కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో సోమవారం రాత్రి సిద్ధి బుద్ధి సమేతుడైన గణనాథుడు సర్వాలంకృతుడై స్వర్ణరథంపై అధిరోహించి ఆలయ మాడా వీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయ హస్తం అందించారు. ప్రతి నెలా పౌర్ణమి అనంతరం సంకటహర చతుర్థి రోజున రాత్రి స్వామివారికి స్వర్ణరథోత్సవం నిర్వహిస్తుంటారు. ఈమేరకు ప్రధాన ఆలయంలోని అలంకార మండపంలో ఉదయం 10 గంటలకు, సాయంత్రం 5 గంటలకు సంకటహర చతుర్థి వ్రతంను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే రాత్రి స్వామివారికి స్వర్ణ రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా సిద్ధి, బుద్ధి సమేత గణనాథుని ఉత్సవమూర్తులను అలంకార మండపంలో వుంచి సర్వాంగ సుందర ంగా అలంకరించి వేద పండితుల మంత్రోచ్ఛారణ నడుమ ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం మంగళవాయిద్యాల నడుమ మిరమిట్లు గొలుపుతున్న అలంకరించిన స్వర్ణరథంపై వుంచి మరోమారు అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం మాడా వీధుల్లో స్వామి, అమ్మవార్లను ఘనంగా ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్‌లు వాసు, కోదండపాణి,టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు, చిట్టిబాబు, అర్చకులు,వేదపండితులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## చిత్తూరు జిల్లాలో 11 పిఎసిఎస్‌లకు పాలకవర్గాలు

కుప్పం, జూలై 14 ప్రభాతవార్త

చిత్తూరు జిల్లాలోని 11 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పిఎసిఎస్)లకు పాలకవర్గాలను ప్రభుత్వం ఖరారు చేసింది. ఒక్కో సహకార సంఘానికి ఛైర్మన్, ఇద్దరు సభ్యులను నియమించారు. చిత్తూరు పిఎసిఎస్‌కు ఛైర్మన్‌గా బిఎన్ రాజసింహులు, సభ్యులుగా వెంకటేశ్వర్లనాయుడు, మోహన్ నియమితులయ్యారు. అలాగే గుడిపాల పిఎసిఎస్‌కు ఛైర్మన్‌గా ప్రతాప్ నాయుడు, సభ్యులుగా హరిప్రసాద్, సెల్వినాథన్, యాదమరి పిఎసిఎస్‌కు ఛైర్మన్‌గా చిత్ర, సభ్యులుగా మహబూబ్ బాషా, ప్రభాకర్, ఐరాల పిఎసిఎస్‌కు పులిగుండ్ల శేషాద్రినాయుడు ఛైర్మన్‌గా, సభ్యులుగా సూరిమణి శ్రీనివాసులు, నంపల్లి సుబ్రమణ్యంలను నియమించారు. పూతలపట్టు పిఎసిఎస్‌కు ఛైర్మన్‌గా జగన్నాథన్, సభ్యులుగా గుణశేఖర్‌రెడ్డి, యాల వెంకటేశ్వర్లు నాయుడు, ఎర్రచెరువుపల్లి పిఎసిఎస్‌కు ఛైర్మన్‌గా ఇంద్రసేన నాయుడు, సభ్యులుగా పాటూరు సుబ్రమణ్యం, కిషోర్, నగరి పిఎసిఎస్‌కు ఛైర్మన్‌గా బాలాజీ, సభ్యులుగా జవహర్‌లాల్, వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. రామకుప్పం పిఎసిఎస్‌కు ఛైర్మన్‌గా మహ్మద్ రఫీ, సభ్యులుగా చెల్దిగానిపల్లి సురేష్, అంజప్ప, కుప్పం పిఎసిఎస్‌కు ఛైర్మన్‌గా నూలుకుంట కృష్ణమూర్తి, సభ్యులుగా కృష్ణవేణి, అన్నాదొరై, గుడుపల్లె పిఎసిఎస్ ఛైర్మన్‌గా రమేష్, సభ్యులుగా వెంకటేష్, కృష్ణప్ప, శాంతిపురం పిఎసిఎస్‌కు ఛైర్మన్‌గా గోపాల్, సభ్యులుగా హరికుమార్, దామోదరలను

## ప్రతి సమస్యకు సత్వర పరిష్కారం : కలెక్టర్ ఆదేశం



చిత్తూరు, జులై 14 ప్రభాతవార్త:

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి అందిన ప్రతి సమస్యను పరిశీలించి సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ అర్జీదారులు సమస్యలపై ఇచ్చి అర్జీని క్షేత్ర స్థాయిలో అధికారులు పరిశీలించి వారికి న్యాయం చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ నరేంద్రపాడెల్, డిఆర్ఓ మోహన్‌కుమార్, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు, డిప్యుటీ కలెక్టర్ విజయలక్ష్మి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

### పిజిఆర్ఎస్‌కు 299 సమస్యలు

కలెక్టర్ సుమిత్‌కుమార్ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా నలుమూలల వున్న ప్రజల నుండి 299 సమస్యలను పరిష్కరించాలని అర్జీలను అందజేశారు. ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించిన కలెక్టర్ సుమిత్‌కుమార్ క్షేత్ర స్థాయిలో సమస్యలను పరిశీలించి సత్వరం సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 199 సమస్యలపై అధికారులకు అర్జీలు అందాయి. అలాగే పోలీసు శాఖ 9, పంచాయతీరాజ్ 4, విద్యాశాఖ 7, డిఆర్‌డిఎ 17, డ్వామా 5, విద్యుత్‌శాఖ 5, పౌరసరఫరాల శాఖ 6, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ 4, గురుకులం 14, సర్వశిక్షాభియాన్ 5లకు సంబంధించి సమస్యలఎపై అర్జీలు అందాయి.

## వీధికొక్క పార్టు వీడిపోయే ట్రాక్టర్లతో పారిశుద్ధ్యం సాధ్యమా?

### నెలల తరబడి కాసుల్లేక మూలపడ్డ కంపాక్టర్లు



ఇదీ శ్రీకాళహస్తి నాలుగుమాడావీధుల్లో పారిశుద్ధ్యం చేసే ట్రాక్టర్ మూలపడ్డ దృశ్యం

**పేరుకు పుణ్యక్షేత్రం. పట్టణజనాభా లక్ష. వాయులింగేశ్వరుని సన్నిధికి రోజూ వచ్చే భక్తులు 20వేల మంది. అయితే ఇక్కడ మున్సిపాలిటి,దేవస్థానం సమన్వయం లేదు. మున్సిపల్ పరిధిలో దేవస్థానం పార్కింగ్ ఫీజులు వసూలు చేసుకుంటుంది. కానీ మున్సిపాలిటికి కాణి ఇవ్వదు.పూర్వ ఒప్పందాలు తుంగలో తొక్కారు. మున్సిపల్ అధికారుల అభ్యర్థనలు దేవాదాయశాఖ బుట్టదాఖలు.సుమారు 30 కిలో మీటర్ల నిడివి గల పట్టణంలో పారిశుద్ధ్యం పరిస్థితి ఆగమ్యగోచరం. నాలుగు కంపాక్టర్లుండగా మరమ్మత్తులకకు కాసుల్లేక రెండు మూల పడ్డాయి. నాలుగు మాడావీధుల్లో పార్ట్‌లు వీడిపోయే స్టాండ్‌బై ట్రాక్టర్‌తో పనులు.సోమవారం ఉదయం నాలుగుమాడావీధుల్లో చెత్తలు తొలగించే పురాతన కాలం నాటిఇట్రాక్టర్ చేతులేత్తేసింది.డ్రైవర్ పోరాడి పోరాడి చివరకు దానిని గాలిగోపురం పక్కన పార్కింగ్ చేసి చేతులు దులుపు కున్నారు. ఔరా మున్సిపాలిటి తీరు అంటూ జనం ముక్కన వేలేసుకున్నసంఘటన.**

శ్రీకాళహస్తి,జూలై 14 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మున్సిపాలిటి పన్నుల డిమాండ్ రూ.10కోట్లు, దీనిపై ప్రతి ఏటా 15శాతం ప్రజలకు చెప్పకుండానే పెంపు.ప్రజల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్న సొమ్ములు అడపా దడపా వార్డుల్లో ప్యాచ్ వర్కులంటూ అస్మదీయులకు నామినేషన్‌పై సమర్పణ. నెలల తరబడి పారిశుద్ధ్యం పనులను పర్యవేక్షించే కంపాక్టర్లు మరమ్మతులకు కాసుల్లేక మూల పడేసిన సంఘటన చోటుచేసుకుంది. ఉన్న రెండు కాంపాక్టర్లను ఒకటి పానగల్, మరోకటి బహాదూరు పేటకు కేటాయించారు. అయితే ఎప్పుడూ అతిధులు సంచరించే నాలుగు మాడావీధుల్లో ఏ భాగానికి ఆ భాగం వీడిపోయే కాలం చెల్లిన స్టాండ్‌బై ట్రాక్టర్లలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ ట్రాక్టర్లో కార్మికులు చెత్తలు పోస్తుంటే వెనుక నుంచి రోడ్ల మీద పడిపోతుంటాయి. ఇక ట్రాక్టర్ల లోచెత్తలు పోసినపుడు మ్యాట్ కప్పుకోవాలి. కానీ అదీ లేదు. ఇక పారిశుధ్యశాఖకు సంబంధించి సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది, అయినా ఉన్న వారితోనే పారిశుద్ధ్యశాఖాధికారులు నెట్టుకొస్తున్నారు.ప్రభుత్వం చేసిన పనులకు సవాలక్ష నిబంధనలతో చెల్లింపులు పక్కన పెడుతున్నారు.దాంతో కాంట్రాక్టర్లు ఇక్కడ పనులు చేయాలంటే భయపడుతున్నారు.ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకులు తమ అనుచరులకు పనులు అప్పగిస్తున్నారు.కానీ చేసిన పనులకు కాసులు రాక కాంట్రాక్టర్లు తల్లడిల్లుతున్నారు. సోమవారం నాలుగు మాడావీధుల్లో పారిశుద్ధ్యం చెత్తలను తీసుకెళ్ళి ట్రాక్టర్ రెండు సార్లు బజారువీధిలో చేతులేత్తేసింది. రెండు సార్లు డ్రైవర్ తిప్పలు పడ్డాడు. నీళ్ళు పోసాడు కానీ ఇంజన్ సీజ్ అయ్యింది. దాంతో దానిని గాలిగోపురం పక్కన పార్కింగ్‌చేసి శానిటరీ ఇన్స్పెక్టర్‌కు సమాచారం అందించాడు.

### రెండు శాఖల మధ్య కొరవడిన సమన్వయం:

శ్రీకాళహస్తి శాసనసభ్యుడుగా బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఉన్నపుడు దేవస్థానం,మున్సిపాలిటి సమన్వయంగా పని చేయాలని ఆదేశించేవారు. అంతేకాక నాలుగుమాడావీధులు పరిశుభ్రం చేయటానికి దేవస్థానం నుంచి ప్రత్యేక సిబ్బంది నియమించి వారు మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ల ఆదేశాలతో పని చేయాలని ఆదేశించేవారు. అంతేకాక మున్సిపాలిటి ప్రవేశ ఫీజు దేవస్థానం కార్‌పార్కింగ్ ఫీజులంటూ వచ్చే భక్తుల మీద భారం వేయకుండా పార్కింగ్‌ఫీజు వసూలు బాధ్యత అంతా దేవస్థానంకు అప్పగించి వచ్చిన టెండర్ సొమ్ములో 40శాతం మున్సిపాలిటికి ఇవ్వాలని ప్రభుత్వం నుంచి జీవో కూడా అందించారు. కానీ 2018 నుంచి ఈ ఒప్పందాన్ని దేవస్థానం అమలు చేయటం లేదు. దాంతో మున్సిపాలిటికి రావాల్సిన వాటా ఆదాయం లేకపోయింది. ఇలా రెండు శాఖల మధ్య సమన్వయం కొరవడి పారిశుద్ధ్యం అధ్వాన్నంగా మారింది. వేసవి కాలం కాబట్టి సరిపోతుంది. వర్షాకాలం వస్తుంది. పారిశుద్ధ్యం ఇలాగే ఉంటే జనాలకు రోగాలు బహుమానంగా మున్సిపాలిటి ఇచ్చినట్లు అవుతుంది. ఇప్పటికైనా శాసనసభ్యుడు రెండు శాఖలను సమావేశ పరచి దేవస్థానం నుంచి మున్సిపాలిటికి రావాల్సిన ఆదాయాలను అందించాల్సి ఉంది. ముఖ్యంగా పరిపాలనలో కీలకమైన శాఖల మధ్య సమన్వయం ఏర్పాటు చేయటం ఎంతో ముఖ్యం.

## కోదండరామునికి వైభవంగా వసంతోత్సవం,చక్రస్నానం

### -ఘనంగా ధ్వజారోహణం, ఏకాంతసేవ



తవణంపల్లె, జూలై 14 ప్రభాతవార్త:

మండలంలోని టి.పుత్తూరు గ్రామంలో వెలసిన శ్రీకోదండరాముల వారి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం వసంతోత్సవం, చక్రస్నానంలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి టి.పుత్తూరుకు చెందిన పిఎం.రవిచంద్రారెడ్డి కుటుంభీకులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వుంచి అలంకరించి అర్చకులు ప్రత్యేకపూజలతో ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. అలాగే తిరుమంజనం, పాలాభిషేకం, మధ్యాహ్నం మోహినిఉత్సవం, సాయంత్రం ఉట్లోత్సవం నిర్వహించారు. సాయంత్రం వసంతోత్సవం, చక్రస్నానం కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి అమ్మవార్లను ఆలయం నుండి ఆలయ పుష్కరిణి వరకు వసంతాలు చల్లుకుంటూ మంగళ వాయిద్యాల నడుమ తీసుకువచ్చారు. పవి త్ర పుష్కరిణిలో స్వామి, అమ్మవార్లకు చక్రస్నానం కార్యక్రమంను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే రాత్రి ధ్వజావరోహణం కార్యక్రమంను నిర్వహించారు. రాత్రి టి.పుత్తూరుకు చెందిన కంచెర్ల బాబునాయుడు అండ్ బ్రదర్స్ ఉభయదారులుగా ఏకాంతసేవ కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ధర ్మకర్త సిద్దేశ్వరరెడ్డి, ఉత్సవ ఉభయదారులు, పరిసర గ్రామస్థులు పాల్గొన్నారు.

## తల్లిని కట్టేసినట్లు వీడియో తీసిన కొడుకుపై కేసు : డిఎస్పీ

కుప్పం, జూలై 14 ప్రభాతవార్త

ఆస్తి వ్యవహారాల్లో కన్న తల్లిని విద్యుత్ స్థంభానికి కట్టేసినట్లు వీడియో తీసి వైరల్ చేసిన కుమారుడు, అతనికి సహకరించిన వారిపై కేసు నమోదు చేసినట్లు కుప్పం డిఎస్పీ పార్థసారథి తెలిపారు. శాంతిపురం మండలం తమ్మిగానిపల్లిలో సురేష్ అనే యువకుడు తన కన్నతల్లి గంగమ్మను విద్యుత్ స్థంభానికి తన పిన్ని కుమారుడు మంజునాథ్ కట్టేసినట్లు తప్పుడు వీడియో చిత్రీకరించి దాన్ని సోషియల్ మీడియాలో వైరల్ చేసిన కుమారుడు సురేష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. ఈ వీడియో వ్యవహారంలో సురేష్‌కు సహకరించిన వారిని సైతం త్వరలోనే అరెస్ట్ చేస్తామన్నారు. వీరిపై చట్టపరంగా కేసులు నమోదు చేశామన్నారు. ఈ సంఘటన వారు ఉద్దేశపూర్వకంగానే చేశారన్నారు.

# 30 మెట్రిక్ టన్నుల వేరుసెనగ విత్తనాలు పంపిణీ

### - 5 రోజుల్లో ఎంసిఎఫ్‌సి గోడౌన్లలో మౌళిక వసతులు: కలెక్టర్



చిత్తూరు, జులై 14 ప్రభాతవార్త:
జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో వేరుసెనగ పంట సాగుకు 30,500 మెట్రిక్ టన్నుల వేరుసెనగ విత్తనాలు పంపిణీ చేయడం జరిగిందని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లా కో–ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో గోడౌన్లను వినియోగంలోకి తీసుకురావడంపై చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ఎంపిఎఫ్‌సి గోడౌన్లను ఐదు రోజుల్లోపు మౌళిక వసతులు కల్పించి వినియోగంలోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. ఎంపిఎఫ్‌సి గోడౌన్లకు సంబంధించి మొదటి దశలో మంజూరు చేసిన 40 గోదాముల్లో ఇప్పటి వరకు 27 గోదాముల నిర్మాణం పూర్తయ్యిందన్నారు. మిగిలిన 13 గోదాముల్లో 4 గోదాములు నిర్మాణ దశలో వున్నాయని, 9 గోదాముల నిర్మాణాలు ఇంకా ప్రారంభం కాలేదన్నారు. పూర్తయిన 27 గోదాములకు సంబంధించి నీరు, విద్యుత్ సౌకర్యం ఐదు రోజుల్లో పూర్తి చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో సహకార సంఘాల ద్వారా పెట్రోల్ బంకులు, పిఎం జన ఔషద కేంద్రాలు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. చిత్తూరు, జిడినెల్లూరు, పలమనేరు, చౌటగుంట ఏరియా ఆసుపత్రుల్లో ఈ కేంద్రాలు ఏర్పాటు చేయడానికి నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, జిల్లా సహకార అధికారి లక్ష్మి, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది

### - మాజీ మంత్రి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కల్లూరు, జులై 14, ప్రభాతవార్త



ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కల్లూరులో సోమవారం మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మేనిఫెస్టో పేరుతో ప్రజలను మరోసారి మోసం చేశారని అన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఎంపీపీ సురేంద్ర నాథ్ రెడ్డి, వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు నాదముని రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు మాజీ సభ్యులు పోకల అశోక్ కుమార్, వైసీపీ నాయకులు అనూష రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, వల్లివేడు పృథ్వి రెడ్డి, మురవత్ బాషా, రాయల్ మోహన్, దామోదర్ రెడ్డి, వెంకటరమణ, షౌకత్, నిరంజన్ రెడ్డి, గోవింద్ రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## 150 మందికి క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు

తవణంపల్లె, జులై 14 ప్రభాతవార్త:
జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం టిబి రహిత భారత్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రం తవణంపల్లె పీహెచ్‌సీలో సోమవారం 150 మందికి క్షయవ్యాధి నిర్ధారణ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించారు. ఈమేరకు ప్రత్యేక జనాభా కింద 60 ఏళ్ళు పైబడిన వారు, మద్యం, దూమపానం అలవాటు వున్నవారు, క్షయవ్యాధిగ్రస్థుల ఇంటి సభ్యులకు సుమారు 150 మందికి డిజిటిల్ హ్యాండ్ ఎక్స్ రే మిషన్ ద్వారా క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. ఇందులో 15 మంది అనూనితులకు గళ్ళ పరీక్షలు నిర్వహించారు. ఎవరికైనా రెండు నెలల పాటు దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలు వున్నట్లయితే వెంటనే ఎక్స్ రే, గళ్ళ పరీక్షలు చేయించుకుని ఆరు నెలల పాటు మందులు వాడినట్లయితే క్షయవ్యాధి పూర్తిగా నయమవుతుందని మండల వైద్యాధికారి డాక్టర్ ప్రయాంక తెలిపారు. ఈకార్యక్రమంలో సీహెచ్ఓ జ్ఞానేశ్వర్, టిబి సూపర్‌వైజర్లు శివకుమార్, సుబ్రమణ్యంలతో పాటు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## గ్రాబ్లింగ్ క్రీడలలో తిరుమలయ్య పల్లి ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రతిభ

## 3 స్వర్ణాలు, 1 సిల్వర్, 2 రజిత పతకాలు కైవసం



వెదురుకుప్పం, జులై 14 ప్రభాతవార్త:
గ్రాబ్లింగ్ క్రీడలలో తిరుమలయ్య పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచి సత్తా చాటినట్లు సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చాముండేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె వివరాలను వెల్లడిస్తూ ఈ నెల 12, 13 తేదీలలో అండర్ 15 రాష్ట్ర స్థాయి గ్రాబ్లింగ్ పోటీలు తిరుపతిలో నిర్వహించారని అన్నారు. ఇందులో తమ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులు యామిని, హేమశ్రీ, 9వ తరగతి చదువుతున్న చైతన్య బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. అదేవిధంగా 9వ తరగతి చదువుతున్న ప్రతిష్ట సిల్వర్, సీబా హర్షిణి, భవ్య రజిత పతకాలు సాధించినట్లు వివరించారు. క్రీడలతో పాటు విద్యలోనూ రాణించాలని విద్యార్థులను ఆమె వారికి సూచించారు. ఈ క్రమంలో విద్యార్థులను క్రీడలలో ప్రతిభావంతులుగా తీర్చిదిద్దిన ఫిజికల్ డైరెక్టర్ త్రిలోక సుందరిని ఆమె అభినందించారు. విద్యార్థులు తాము ఎంచుకున్న రంగాలలో ప్రతిభావంతులుగా రాణించడానికి ఈ క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు క్రీడాకారులను అభినందించారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటండి..!

వెదురుకుప్పం, జులై 14 ప్రభాతవార్త:
పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కనీసం రెండు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని హెచ్ఎం కె.చాముండేశ్వరి అన్నారు. తిరుమలయ్య పల్లి, జడ్పీ హైస్కూల్ ఆవరణలో సోమవారం ఆమె మొక్కలు నాటి నీరుపోసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా అభివృద్ధితో పాటు పెరుగుతున్న కాలుష్య నియంత్రణకు చెట్లు పెంచడం తప్పనిసరి అన్నారు. పాఠశాల ఆవరణలోని ఆట స్థలం హద్దులలోపు చెట్లు నాటాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ శ్రీనివాసులు రెడ్డి, మాజీ సర్పంచ్ మొగిలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఆనందంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పులిచెర్ల, జులై 14, ప్రభాతవార్త



పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతీ మర్రికుంట వారి పల్లిలో సామాజిక కార్యకర్త షోలింగరం వెంకటాచలం స్వగృహంలో 1973 – 74వ సంవత్సరం 10వ తరగతి అపూర్వ విద్యార్థుల సమ్మేళనం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ సందర్భంగా ఒకరికి ఒకరు తమ జీవన ప్రమాణాలు కుటుంబ సభ్యుల క్షేమ సమాచారాలు తెలుసుకొని ఆనందంగా గడిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పులిచెర్ల సింగల్ విండో అధ్యక్షుడు లెక్కల ధనంజయ నాయుడు మాట్లాడుతూ ఆరు పదుల వయసున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనకి రావడం ఎంతో సంతోషదాయకమని మీ అందరి ఆశీస్సులు నాకు ఉండాలని అన్నారు. ముఖ్య అతిథిగా ఆహ్వానించిన వెంకటాచలం అన్నకు, పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ఉదయం నుంచి సాయంకాలం వరకు ఎంతో తీపి జ్ఞాపకాలతో గడిపి మంచి విందు భోజనం భుజించి వారి వారి స్వగ్రహాలకు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో వెంకట ముని నాయుడు, డాక్టర్ పరంధామ, రచయిత రాసాని వెంకటరామయ్య, విజయ్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

## శాంతిపురం సింగిల్‌విండో అధ్యక్షుడిగా గోపాల్

శాంతిపురం, జులై 14 ప్రభాతవార్త



శాంతిపురం మండల సింగిల్‌విండో అధ్యక్షుడిగా చెంగుబళ్ల మాజీ సర్పంచ్ గోపాల్ ఎంపికైనట్లు తెదేపా వర్గాలు తెలిపాయి. అలాగే సభ్యులుగా శివరాంపురంకు చెందిన దాము, జనసేనకు చెందిన శివ కురుబూరు హరికుమార్‌లు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు గోపాల్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఛైర్మన్ పదవి అప్పగించిన సిఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్, ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సింగిల్‌విండో ద్వారా రైతులకు రుణాలు విరివిగా అందేలా కృషి చేస్తామన్నారు.



## మృత్యుంజయుని ఆలయానికి పోటెత్తిన భక్తజనం

చౌడేపల్లి, జులై 14 ప్రభాతవార్త
అభిషేక ప్రియుడు చౌడేపల్లి మృత్యుంజయేశ్వరస్వామి ఆలయానికి భక్త జనం పోటెత్తింది. ఉదయాన్నే ప్రధానార్చకులు రాజశేఖర్‌దీక్షితులు, కుమారస్వామి, మహేష్‌స్వామిలు పరమ శివుడికి విశేషాభిషేకం, అలంకరణగావించారు. రాష్ట్రం నలు మూలల నుంచి కాకుండా కర్ణాటక, తమిళనాడుల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పార్వతీ, పరమేశ్వరుల అభిషేకం, అర్చనాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వారందరికీ పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

## అసిస్టెంట్ లైన్మెన్‌గా పదోన్నతి కల్పించండి

పుంగనూరు రూరల్, జులై 14, ప్రభాతవార్త



రాష్ట్ర సంఘం ఆదేశాల మేరకు పుంగనూరు ఏపీ ఎస్పీడీసీఎల్ కార్యాలయం ఎదుట జూని యర్ లైన్మెన్లు సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూనియర్ లైన్మెన్లను పాత సర్వీస్ రూల్స్ ప్రకారం అసిస్టెంట్ లైన్మెన్లుగా పదోన్నతి కల్పించాలన్నారు. సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న తమకు ఇప్పటికీ ఉచిత పదోన్నతులు లభించకపోవడం దుర్మార్గమని వాపోయారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ లైన్మెన్ సంఘ సభ్యులు రవి నాయక్ గోవర్ధన మహేష్ రమేష్ లవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉనికి కోసమే పెద్దిరెడ్డి ఆరోపణలు - కూటమి నేతలు



పుంగనూరు రూరల్, జులై 14, ప్రభాతవార్త
వైయస్సార్ పార్టీని ఉనికిలోకి తెచ్చేందుకు సీఎం చంద్రబాబు నాయుడుపై పెద్దిరెడ్డి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని కూటమి నాయకులు విమర్శించారు. మండల పరిషత్ కార్యాల యంలో సోమవారం ఎన్డీఏ కూటమి నేతలు విలే కరుల సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి మాట్లాడుతూ ఇటీవల పుంగనూరులో పర్యటించిన వైసీపీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడిపై చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా ఖండిస్తున్నారు. ప్రజల మద్దతుతో అధికారం లోకి వచ్చిన ఎన్డీఏపై అసత్య ఆరోపణలు చేయడం అనైతికమని పేర్కొన్నారు. చంద్రబాబు ప్రజల మేలు కోరి పాలన సాగిస్తున్నారని తెలిపారు. సమావేశంలో టిడిపి మండల అధ్యక్షుడు మాధవరెడ్డి, సి.వి.రెడ్డి, సయ్యద్ సుహేల్ భాష, శ్రీకాంత్ మొదలియార్, జనసేన ప్రోగ్రాం సభ్యులు చైతన్య రాయల్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు జగదీష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## సామాన్యులకు రోటరీ సేవలు అందించాలి

పుంగనూరు, జులై 14, ప్రభాతవార్త
సమాజంలో పేదరికంలో ఉన్న సామాన్యులకు రోటరీ విద్యా వైద్య సేవలు అందించాలని బెంగళూరు రోటరీ డిస్టిక్ గవర్నర్ నామిని హరిణి రవీంద్రనాథ్ అన్నారు. రోటరీ నూతన కార్యవర్గ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రోటరీ నూతన అధ్యక్ష కార్యదర్శులుగా ఎన్నికైన నానబాల గణేష్, సిఎస్ రాజారెడ్డిలను అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజం, ప్రభుత్వాలు ఆదుకోలేని నిజమైన విద్యా వైద్య ఆర్థులను అక్కున చేర్చుకోవాల్సి న బాధ్యత రోటరీ క్లబ్ చేయాలనని, ఇదే క్లబ్ వ్యవస్థాపక మూల లక్ష్యమన్నారు. భారతదేశంలో వెలుతురు చేరలేని చోట్లలో కూడా రోటరీ సేవల అద్భుతున్నాయని ప్రకటించారు. బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ గా డాక్టర్ విజయ్ కుమారి, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ శరన్ కుమార్, పూల త్యాగరాజు, ఈ ఎస్ భాస్కర్, భాస్కర్ జెట్టి,ఎస్వీట్ కిషోర్, అనిల్, జాన్, నాగిరెడ్డి, సురేష్, ఆవుల హరిప్రసాద్, మునిరాజా, భాస్కర్ రెడ్డి, హర్షదాలి, వేణుగోపాల్ రాజు, రవి కిషోర్, డాక్టర్ హరి గోపాల్, కృష్ణ కుమార్, సుధాకర్ రెడ్డి, సత్యాచారి, పి. ప్రవీణ్, ఇట్టా శ్రీధర్, ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## మార్షల్ ఆర్ట్స్ లోగో ఆవిష్కరణ



పుంగనూరు, జులై 14, ప్రభాతవార్త
మహేష్ మార్షల్ ఆర్ట్స్ లోగోను సర్కిల్ ఇన్స్పెక్టర్ సుబ్బారాయుడు సోమవారం ఆవిష్క రించారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్లు హేమంత్, రెడ్డి మహేష్, కిరణ్ కుమార్‌లు మాట్లాడుతూ ఈ నెల 27 వ తేదీన ప్రారంభం అవుతున మహేష్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీకు ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, అడిషనల్ ఎస్పీ రాజశేఖర్ రాజు పాల్గొని ప్రారంభిస్తారని తెలిపారు.

## కన్నుల పండుగగా ద్రౌపది దేవి కల్యాణోత్సవం



సదుం, జులై 14, ప్రభాతవార్త
సదుం గ్రామపంచాయతీ పరిధిలోని బట్టువారిపల్లి వద్ద వెలసిన ద్రౌపతమ్మ ఆలయంలో సోమవారం సాయంత్రం ద్రౌపతి దేవి కళ్యాణోత్సవం కన్నుల పండుగ నిర్వహించారు. చదుము ఉపసర్పంచ్ బాబురెడ్డి దంపతులు, జాండ్రపేటకు చెందిన మల్రెడ్డి దంపతులు కళ్యాణోత్సవంలో ఉభయ దారులు వ్యవహరించారు. ఇటీవల ప్రారంభమైన మహాభారత యజ్ఞంలో భాగంగా ఈ కళ్యాణోత్సవం నిర్వహించారు. బోయకొండ ఆలయ మాజీ కమిటీ సభ్యుడు భాస్కర్ రెడ్డి, సదుం ప్రాథమిక పాఠశాల మాజీ ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి, విశ్రాం త ఉపాధ్యాయుడు మోహన్ రెడ్డి, చిన్న రమణ, రామానుజులు తదితరులు పాల్గొన్నారు.

## ఐటిఐ దరఖాస్తులకు 20న ఆఖరుతేది

శాంతిపురం, జులై 14 ప్రభాతవార్త
తుమ్మిశిలోని ప్రభుత్వ ఐటిఐ కాలేజ్‌లో ప్రవేశాలకు సంబంధించి ఈనెల 20వతేది దరఖాస్తులకు చివరి తేది అని ప్రిన్సిపాల్ శేషారెడ్డి తెలిపారు. ఈనెల 22న సర్టిఫికెట్ల వెరిఫికేషన్, 23న కౌన్సిలింగ్ ఉంటుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## కుక్కలున్నాయి పిక్కలు జాగ్రత్త...!

### -ఆందోళనలో పట్టణ వాసులు

చౌడేపల్లి, జులై 14 ప్రభాతవార్త



మండల కేంద్రమైన చౌడేపల్లిలో రోజురోజుకూ కుక్కల బెడద అధికమవుతోంది. బస్టాండు, గాంధీవీధి, బజారువీధి, నేతాజీ నగర్, మేదరదొడ్డి, గోసలకురపల్లి తదితర ప్రాంతాల్లో శునకాలు అధికంగా సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఇటీవల కాలంలో పలు చోట్ల శునకాలు చిన్నారులను పొట్టన పెట్టుకొంటున్న విషయం విధితమే. ఈ సంఘటనలు సోషియల్ మీడియాలో హల్ ఛల్ చేస్తున్నాయి. దీంతో పిల్లలు, వృద్ధులు కుక్కల బెడద వల్ల ఇళ్ళకే పరిమితమవుతున్నారు. ద్విచక్ర వాహనాల్లో వెళ్ళేవారిని శునకాలు వెంబడిస్తూ వెళ్ళి మరీ పిక్కలు పట్టుకొనేందుకు ప్రయత్నిస్తున్నాయి. ప్రభుత్వాసుపత్రి, ప్రాథమిక పాఠశాల, ఉన్నతపాఠశాలల సమీపంలో శునకాలు విచ్చల విడిగా సంచరిస్తుండటంతో మహిళలు, పిల్లలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు ప్రమాదం సంభవించక ముందే స్పందించి కుక్కల బారినుంచి పట్టణవాసులకు విముక్తి కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

## ఆషాడమాసంలో సంకటహరచతుర్ధశి పూజలు



తిరుపతి(రవాణ),జులై 14ప్రభాతవార్త:
పవిత్రమైన ఆషాడమాసం సోమవారం సాయంత్రం సంకష్టహరచతుర్దశిరోజు విఘ్నాలకు అధిపతి వినాయకుడిని పూజించి వేడుకుంటే అన్నీ శుభాలు జరుగుతాయని వరసిద్దివినాయక మహోత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. గణపతి సంకట హరచతుర్దశి సందర్భంగా సోమవారం సాయంత్రం వినాయక సాగర్‌లోని వరసిద్దివినాయకునికి ఆలయ కమిటీ సభ్యులు గుండాల గోపీనాథరెడ్డి, తొండమనాటి సుబ్ర మణ్యంరెడ్డి, నాదమునిరెడ్డి, మురళి,వాసు, శాంతి, జ్యోతిలక్ష్మి, కృష్ణయ్య, మురళి, వాసు,విజయలక్ష్మి, వాసుదేవరెడ్డి,ఆనంద్ తదితరులతో కలసి అర్చకుడు సురేష్‌స్వామి వినాయకునికి సంకష్టహరచతుర్దశిన ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. వినాయకుడిని అలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. స్వామివారి ప్రసాద వితరణ జరిగింది.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## మూడు టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

కుప్పం, జులై 14 ప్రభాతవార్త
రామకుప్పం మండల పరిధిలో రేషన్ బియ్యంను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకుని సీజ్ చేసినట్లు డిఎస్పీ పార్థసారథి తెలిపారు. ననియాలకు చెందిన గోవిందరాజులు, మాణిక్యం, కుమార నాయక్ అనే వ్యక్తులు ఈ బియ్యం రవాణా చేస్తున్నారన్నారు. వీరు రేషన్ బియ్యాన్ని వి.కోటకు చెందిన ఆండెప్పకు విక్రయించేవారన్నారు. ఆండెప్పపై గతంలో కూడా కేసులు ఉన్నాయన్నారు. మూడు టన్నుల రేషన్ బియ్యంను రామకుప్పం ఎస్సై వెంకటమోహన్ సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చి కేసు నమోదు చేశారన్నారు.

## ఇళ్ల స్థలాల కోసం భూముల పరిశీలన

కుప్పం, జులై 14 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడు, ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ ఆదేశాల మేరకు కుప్పం మున్సిపాలిటీ పరిధిలో పేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించేందుకు సోమవారం అధికార, ప్రజాప్రతినిధులు భూములను పరిశీలించారు. మున్సిపల్ పరిధి చీలేపల్లి వద్ద గల ప్రభుత్వ భూములను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు,కొత్తపేట ఇన్‌చార్జ్ అప్పు, సర్వేయర్ సాయి పాల్గొన్నారు.

## వన్ఎంవన్‌బి ఫ్యూచర్ రెడీ ఇనిస్టిట్యూషన్‌గా కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్



కుప్పం, జులై 14 ప్రభాతవార్త
స్వయంప్రతిపత్తి కలిగిన కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్, వన్‌మిలియన్‌ఫర్ వన్ బిలియన్ (వన్ఎంవన్‌బి) సంస్థతో మౌఖిక ఒప్పందం కుదుర్చుకుని ఫ్యూచర్ రెడీ ఇనిస్టిట్యూషన్‌గా మారింది. ఐక్యరాజ్యసమితి గుర్తింపు పొందిన వన్ఎంవన్‌బి సంస్థ యువతకు నైపుణ్యాభివృద్ధి, మెరుగైన ప్లేస్‌మెంట్ కల్పించడంలో అవకాశాలు కల్పిస్తోంది. ఈ ఒప్పంద కార్యక్రమంలో కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ ఛైర్మన్ డా॥ సునీల్‌రాజ్, ప్రిన్సిపాల్ డా॥ సుధాకర్‌బాబు, వన్ఎంవన్‌బి లీడ్, గవర్నమెంట్ అడ్వకేసీ దీపిక వెంకటేష్, ప్లేస్‌మెంట్ అధికారి డా॥ జయకుమార్ పాల్గొన్నారు. ఈసందర్భంగా కాలేజ్ వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్ మాట్లాడుతూ విద్యార్థుల కెరీర్ అవకాశాలు మెరుగుపరచడంతో పాటు ఎఐ, గ్రీన్ స్కిల్స్ వంటి వాటిపై నైపుణ్యం పెంచేలా చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు.

## ఆలయ భూములు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

కుప్పంరూరల్, జులై 14 ప్రభాతవార్త



కురబ కులస్తుల కులదైవం శ్రీ బసవేశ్వరస్వామి ఆలయంకు చెందిన భూములు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుని భూములను కురబ కులస్తులకు అప్పగించాలని రాష్ట్ర కురబ కార్పోరేషన్ డైరెక్టర్ రాజగోపాల్ కడ పి.డి. వికాస్ మర్మత్‌కు వినతి పత్రం అందించారు. శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లి గ్రామ రెవెన్యూలో వివిధ సర్వే నెంబర్లలో 1.70 ఎకరాలు భూమి ఉందన్నారు. ఈ భూములకు సంబంధించి సర్వే చేయించాలని అలాగే ఆక్రమించిన వారిపై తగు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కడ సభ్యుడు రామచంద్ర, కురబ కులస్తులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు 36 లక్షలు ఎంపీ నిధులు మంజూరు

సదుం, జులై 14, ప్రభాతవార్త
రాజంపేట పార్లమెంట్ సభ్యుడు పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి నిధులనుంచి వివిధ అభివృద్ధి పనులకు రూ.36 లక్షలు నిధులు విడుదలైనట్లు జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి తెలిపారు. సదుం ప్రభుత్వ ఆసుపత్రిలో మార్చురీ రూమ్ ఏర్పాటుకు 13 లక్షలు అదేవిధంగా చింతపర్తివారిపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఐదు లక్షలు సదుం లోని ధోబి ఘాట్ వద్ద అదనపు గది నిర్మానానికి ఐదు లక్షల చొప్పున మంజూరు అయ్యాయి అన్నారు. సదంలోని కల్లూరు రోడ్డులో షాది ఖానాలో అదరపు గది నిర్మాణానికి నాలుగు లక్షల రూపాయలు మంజూరు అయిందన్నారు. అదే విధంగా పులిచెర్ల మండలం కల్లూరులో ముస్లిం స్మశాన వాటికలో ప్రహరీ గోడ నిర్మాణానికి 3 లక్షలు మంజూరు కాగా సోమలలో గంగమ్మ గుడి వీధిలో సీసీ రోడ్ నిర్మాణానికి 3 లక్షల రూపాయలు సోమలలో ఎంపీపీ స్కూల్, అంగన్వాడి భవనానికి ప్రహరీ నిర్మాణానికి మూడు లక్షల రూపాయలు మంజూరు అయినట్లు ఆయన చెప్పారు.

## జన్నునూగుతో ప్రజలకు తప్పని తిప్పలు

### -కంటి సమస్యతో కష్టాలు



కాంప్లెక్సు వెనుకభాగంలో వున్న జన్ను ఇన్‌సెట్‌లో నూగు

చౌడేపల్లి, జులై 14 ప్రభాతవార్త
జన్నునూగుతో పట్టణ ప్రజలు తంటాలు పడుతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు గాలి వీచేదిశగా జన్నునూగు కళ్ళల్లో పడి తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. హెచ్‌పి పెట్రోల్ బంకు సమీపంలో నూతన కాంప్లెక్సు వెనుక భాగంలో జన్ను విస్తారంగా వుంది. అది ఎండి పోయి అందులోంచి నూగు గాలి వాటం వైపు వస్తున్నాయి. దీంతో ఆ ప్రాంతంతోపాటు పట ్టణంలోని బస్టాండు, ఎంపిడిఓ కార్యాలయ సముదాయం, వరదా కాంప్లెక్సు తదితర ప్రాంతాల్లో నూగు వస్తోంది. జన్నునూగు కళ్ళల్లో పడుతుండటంతో కంటి సమస్యలను ఎదుర్కొనవలసి వస్తోందని ప్రజలంటున్నారు. అంతే కాకుండా తిను బండారాలు, హోటళ్ళల్లో నూగు చేరి మరింత ఇబ్బందులకు గురిచేస్తోంది. అధికారులు స్పందించి జన్ననూగు సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

## నేడు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ : కడ పి.డి.



కుప్పం, జులై 14 ప్రభాతవార్త
కుప్పం ప్రాంతంలో ఉన్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు మంగళవారం కుప్పం కడ కార్యాలయంలో ఎంటర్‌ప్యూనర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఇడిపి)కింద శిక్షణ కల్పిస్తున్నట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. పరిశ్రమల ఎంపిక, అనుమతులు, బ్యాంకు రుణాలు, రాయితీలు, డిజిటల్ మార్కెటింగ్, రోడ్ మ్యాప్ తదితర అంశాలపై ఈ శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని కుప్పం ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## పోలీసులు లేని సమాజాన్ని ఊహించలేం..

### .. అమర రాజా సంస్థల సేవలు అమోఘం.....



రేణిగుంట జులై 14 ప్రభాతవార్త
పోలీసులు లేని సమాజాన్ని ఊహించుకోలేమని అమర ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ గౌరినేని రమాదేవి అనగా, అమర ఆసుపత్రి సేవలు అమోఘమని తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు అన్నారు. రేణిగుంట మండలం కరకంబాడి అమర రాజా కంపెనీ ఆడిటోరియంలో సోమవారం నుండి తిరుపతి జిల్లా పోలీసులకు అమర ఆసుపత్రి, కాంటినెంటల్ కాఫీ సంయుక్తంగా తిరుపతి జిల్లా పోలీసులకు వార్షిక ఉచిత ఆరోగ్య పరీక్ష కేంద్రాన్ని ప్రారంభించారు. శిబిరాన్ని తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, అమర ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ గౌరినేని రమాదేవి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సోమవారం నుండి బుధవారం వరకు దాదాపు 1.20,00,000 రూపాయలు ఖర్చు చేస్తున్నారు. శిబిరంలో పోలీసులకు బీపీ టెస్ట్ మొదలు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రమాదేవి గౌరినేని మాట్లాడుతూ పోలీసులు రాత్రి పగలు సమాజాన్ని కాపాడుతున్నారన్నారు. వారు చేస్తున్న సేవల వల్లే ప్రజలు నిశ్చింతగా ఉన్నారన్నారు. ఎస్పీ హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ అమర ఆసుపత్రి రోగుల సేవలో తరిస్తుంటే, అమర్ రాజా కంపెనీ ఎంతోమందికి జీవనోపాధి కల్పిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు వెంకట్రావు, నాగభూషణం, రవి మనోహరా చారి, రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు, రేణిగుంట అర్బన్ సీఐ జయచంద్ర, రేణిగుంట రూరల్ సీఐ మంజునాథ్ రెడ్డి, ఏర్పేడు సీఐ శ్రీకాంత్ రెడ్డి, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్ఐలు, ఎస్సైలు, హెడ్ కానిస్టేబుల్, సిబ్బంది పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

# అటవీ భూముల వివాదాలకు తెరపడే రోజు దగ్గర్లో ఉంది!

శ్రీకాళహస్తిరూరల్, జూలై 14 ప్రభాతవార్త: మండలంలోని బ్రాహ్మణపల్లిలో అటవీశాఖ భూ సమస్యలకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటి మాజీ చైర్మెన్ రంగినేని చెంచయ్యానాయుడు అన్నారు. సోమవారం మండలంలోని కొండ కింద పల్లెలు ఈంద్రపల్లి, వాగవీడు, యల్లంపల్లి, పాపనపల్లి, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో సుపరి పాలనలో ఏడాది తొలి అడుగు కార్యక్రమాల్లో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికి వెళ్ళి ఏడాదిలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు పెన్షన్లు, రేషన్, ఏడాదిలో శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యుడు ఈప్రాంత సమస్యలపై ఎంతో దృష్టి పెట్టారన్నారు. ముఖ్యంగా ఎస్ ఎస్



కెనాల్, మన్నవరం వద్ద కొత్త పరిశ్రమల స్థాపనకు చేస్తున్న కృషిని వివరించారు. రాబోవు రోజుల్లో ఎన్నో పరిశ్రమలు ఈ పరిసరాల్లో రానున్నాయని వాటితో గ్రామాల్లో ఏ ఒక్కరు ఖాళీగా ఉండటానికి వీల్లేకుండా చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ అధ్యక్షుడు అక్షింతల కృష్ణయాదవ్, చెలికం పాపిరెడ్డి, కామేష్‌యాదవ్, రేవుల రమేష్, తాటిపర్తి రవీంద్రరెడ్డి, కృష్ణం నాయుడు, దొరైరాజ్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, వెంకటరత్నం, కృష్ణం నాయుడు, కృష్ణారెడ్డి చరణ్, మనోహర్, హరికృష్ణ, సుదర్శన్‌రెడ్డి, శివప్రసాద్, వవెంకట రామయ్య, మునిశేఖర్ తదితరులు హాజరయ్యారు.

## చెంచులక్ష్మీకాలనీ విద్యార్థులకు వితరణ



శ్రీకాళహస్తి, జూలై 14 ప్రభాతవార్త : శ్రీకాళహస్తికి సమీపంలోని చెంచులక్ష్మీ కాలనీలో చదువుతున్న విద్యార్థులకు సామాజిక కార్యకర్త యల్లంపాటి కోటేశ్వర రావు ఏడాదికి సరిపడ్డ విద్యాసామగ్రిని వితరణగా అందించారు. సోమవారం పాఠశాలలో 65మంది విద్యార్థులు చదువుతున్నారు. శ్రీకాళహస్తిలోని చుట్టుపక్కల గ్రామాలకు చెందిన గిరిజన, దళిత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు విద్యాసామగ్రితో పాటు యూనిఫారాలు అందిస్తూ ప్రశంసలందు కుంటున్నారు. ఈ కార్యక్రమాల్లో పాఠశాల ప్రదానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## భక్తుల నీడ కోసం పందిళ్ళు... పర్యవేక్షణ లేక పార్కింగ్

శ్రీకాళహస్తి, జూలై 14 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయం భక్తుల సదుపాయాల కోసం చేపడుతున్నా, పర్యవేక్షణ కరువై దారి తప్పుతున్నాయి. శ్రీకాళహస్తీశ్వరాలయ అధికారి భక్తులు ఎండలను తట్టుకోలేక, కాళ్ళు కాల కుండా ఎర్రటి తివాచిలు పరిపించారు. అయితే ఇక్కడ పర్యవేక్షణ లేక పందిళ్ళ కింద ఎంచక్కా కొందరు తమ ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. అసలే చిన్న



రోడ్డుగా ఉంటడంతో మహోన్నతాశయంతో శివరాత్రి ముందు స్థానిక శాసనసభ్యుడు రోడ్డు వెడల్పు కార్యక్రమా లను చేపట్టారు. ఇక ఇట మరో అడుగు ముందుకు వేసి మూడో గేటు నుంచి 4వగేటు వరకు భక్తులు ఎండలకు అలసి పోకుండా సిమెంటు రోడ్డు కాబట్టి కాళ్ళు కాలకుండా ఎర్రటి తివాచీలను ఏర్పాటు చేయించారు. అయితే అన్ని సదుపాయాలు కల్పిస్తున్న అధికారి ఎందుకో పర్యవేక్షణలో విఫలమౌతున్నారు. ఆలయానికి లెక్కకు మించి సెక్యూరిటి సిబ్బంది ఉన్నారు. కానీ ఆలయం పరిసరాల్లోనూ సన్నిధివీధిలో అడుగడుగునా సెక్యూరిటి సిబ్బంది ఉంటారు. కానీ ఎందుకు ద్విచక్రవాహనాల ను కట్టడి చేయలేక, దాంతో వృద్దులు, పసిపిల్లలు, అంగవైకల్యం కల్గిన వారు ఇబ్బదులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఆలయాధికారులు స్పందించి కట్టడికి కృషి చేయాలని కోరుతున్నారు.

## ఎంఎల్ఏపై నిరాధార ఆరోపణలు తగదు



శ్రీకాళహస్తి, జూలై 14 ప్రభాతవార్త : ఎంఎల్ఏపై నిరాధార ఆరోపణలు తగదని ఆంధ్రప్రదేశ్ గిరిజన సలహా మండలి సభ్యులు ఎం.సుబ్బయ్య సోమవారి మీడియా సమావేశంలో ఖండించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వినూత కోట వద్ద పని చేస్తున్న డ్రైవర్ని హత్య చేసారన్న ఆరోపణలపై ఇన్‌చార్జితో పాటు నలుగురుపై తమిళనాడు పోలీసులు కేసు నమోదు చేస్తే వారు తమది తప్పేమి లేదంటూఇదంతా కావాలనే ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి చేయించారని ఆరోపించటంపై సోమవారం సుబ్బయ్య ఖండించారు. వినూత డ్రైవర్ హత్యకు ఎంఎల్ఏకు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. నిందారోపణ, నేరారోపణ వచ్చినపుడు తాము నిప్పులాంటి వారనినిరూపించుకోవాలి కానీ ఎంఎల్ఏపై నిరాధారణ ఆరోపణలు చేస్తే జనం తిరగబడే పరిస్థితి తెచ్చుకోద్దన్నారు. వినూత దంపతులు ఏం మాట్లాడు తున్నారో ఏమో వారికే అంతుపట్టడం లేదన్నారు.

## రాజకీయంగా రెచ్చగొట్టె వ్యాఖ్యానాలపై ఫిర్యాదు

శ్రీకాళహస్తి, జూలై 11 ప్రభాతవార్త : శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డిపై వివిధ సామాజిక మాద్యమాల ద్వారా కొందరు కావాలని తప్పుడు ప్రచారం చేస్తూ న్యాయవిచారణలో ఉన్న అంశాన్ని రాజకీయం చేయటం తగదని సోమవారం శ్రీకాళహస్తి డిఎస్‌పి నరసింహామూర్తికి రాతమూలకంగా తెలుగుదేశం నాయకులు ఫిర్యాదు చేసారు. మాజీ కౌన్సిలర్, మీడియా ప్రతినిధి నాగమల్లి దుర్గా ప్రసాద్, బాలాజిరెడ్డి, ఖాదర్, వినయ్‌కుమార్, సాయి, చందు బాలాజి, గిరిలు కలసి



కొందరు కావాలని పని కట్టుకొని రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యానాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కేసు నమోదు చేయాలని వినతి పత్రం అందించారు. ఒక వైపు తామే హత్యచేసామని చెన్నై పోలీసులకు వాంగ్మూలం ఇచ్చినట్లు ప్రచారం జరుగుదుండగా కొన్ని సామాజిక మాద్యమాలలో అర్థరహిత ఆరోపణలతో తప్పుడు వార్తలు ప్రసారం చేయటం గుర్తించాలని వినతి పత్రంలో కోరారు.

## నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం



శ్రీకాళహస్తిరూరల్, జూలై 14 ప్రభాతవార్త : మండలం గుండ్లపల్లి గ్రామంలో ఎస్టి కాలనీకి చెందిన శ్రీను, కలవ గుంట గిరిజనకాలనీకి చెందిన చిట్టెమ్మలు మృతి చెందారు. వారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకొనుటకు శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ హాజరై నివాళులర్పించారు. ఆదుకోనుటకు మేమున్నామని భరోసా ఇచ్చారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు. ఆమెతో పాటు మాజీ శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యానాయుడు తదితరులున్నారు.

## బండారుపల్లిలో రెవెన్యూ సదస్సు

శ్రీకాళహస్తిరూరల్, జూలై 14 ప్రభాతవార్త: ఏర్పేడు మండలం బండారుపల్లి గ్రామంలో సోమవారం ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ సదస్సును నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురువారెడ్డి సారధ్యంలో సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎంతో కాలంగా ఎదుర్కొంటున్న ఇంటి పట్టాల గురించి అధికారులను కోరారు. అలాగే భూ పట్టాల గురించి పలువురు వివరిస్తూ భూములు ఒకరి స్వాదీనంలో ఉండగా రికార్డులు అస్తవ్యస్తంగా ఉన్నాయని వివరించారు. ఈ సమస్యలపై రెవెన్యూ ప్రతినిధులు స్పందిస్తూ



నేడు ఇచ్చిన అర్జీలను పరిశీలించి త్వరలోనే పరిష్కరిస్తామని వివరించారు. ఈ కార్యక్రమాల్లో గురువారెడ్డితో పాటు ఆర్ఐ సుబ్రమణ్యం, విఆర్ఓ ముని, గ్రామమాజీ సర్పంచ్ శివశంకర్‌రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు సుబ్రమణ్యం యాదవ్, సర్వేయర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గిరిజనులకు ఇంటి పట్టాలు మంజూరు చేయండి : సీపీఐ



సత్యవేడు, జూలై 14 ప్రభాతవార్త: అర్హులైన గిరిజనులు అందరికి ఇంటి పట్టాలు ఇవ్వాలని సత్యవేడు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్నిరాజ్ కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో అమావాస్ రెడ్డి కండ్రిగ గిరిజనులు పలువురు ధర్నా చేశారు. ఈ సందర్భంగా చిన్నిరాజ్ మాట్లాడుతూ కొత్తమారి కుప్పం పంచాయతీలో ప్రభుత్వ భూములన్ని బడా బాబులకు ఉన్నట్టు ఆరోపించారు. అయితే అమావాస్‌రెడ్డిగా ఎస్టీ కాలనీలో ఇంటి స్థలాలు లేని గిరిజనులకు ఇంటి పట్టాలు ఇవ్వడంలో సంబంధిత రెవెన్యూశాఖ మీనమేషాలు లెక్కించడం సరికాదన్నారు. ఎస్టీ కాలనీలో ఇప్పటికే 150 కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. ఇందులో 50కుటుంబాలు ఇంటిస్థలాలు లేకుండా ఇబ్బందులు పడుతున్నాయన్నారు. పలుమార్లు అర్జీలు సమర్పించినఆ ఇంటి పట్టాల మంజూరులో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వహించడంపై ఆయన మండి పడ్డారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు స్వప్న, మారి, వెంకటలక్ష్మి, వసంత, అమలు తదితరులు పాల్గొన్నారు.

## రెండు అక్రమ ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

సత్యవేడు, జూలై 14 ప్రభాతవార్త: మండలంలోని వెంకటరాజుల కండ్రిగ గ్రామం వద్ద అక్రమంగా తరలిపోతున్న రెండు ఇసుక ట్రాక్టర్లను స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా...నాగలాపురం అరుణానది ఏటినుంచి అక్రమంగా ఇసుక సరిహద్దులు దాటుతున్నట్టు ఆరోపణల నేపథ్యంలో దీనిపై స్థానిక పోలీసులు నిఘా ఉంచారు. ఈ క్రమంలో సత్యవేడు పోలీసులు సోమవారం ఉదయం వీఆర్ కండ్రిగ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. అదే సమయంలో రెండు ఇసుక ట్రాక్టర్లు



రావడంతో పోలీసులు ఆపి రికార్డులను పరిశీలించారు. అయితే ఇసుక తరలింపు సంబంధించి ఎటువంటి అనుమతులు లేకపోవడంతో ఇసుకట్రాక్టర్లు స్వాధీనం చేసుకుని ఇందుకు సంబంధించిన డ్రైవర్లు శ్రీరాములు, సుబ్రహ్మణ్యంలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

## మాదక ద్రవ్యాల నిరోధంపై అవగాహన కార్యక్రమాలు

తిరుపతి విద్య, జూలై 14 ప్రభాతవార్త: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 16 వ తేదీ నుంచి 23వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు యస్వీయూ ఉపకులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు అన్నారు. దీనికి సంబంధించిన గోడపత్రికను ఈ రోజు సాయంత్రం ఆవిష్కరించారు. డైరెక్టర్ ఆచార్య మురళీధర్, కోఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ వారం పాటు ఈ కార్యక్రమాన్ని యస్వీయూలోని వివిధ కళాశాలలతో పాటు, యస్వీయూ అనుబంధ కాలేజీల్లో కూడా డ్రగ్స్ రహిత సమాజం కోసం ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని విశ్వవిద్యాలయం అధికారులు తెలిపారు.

## తాగునీటి సౌకర్యం కల్పించండి



తిరుపతిరూరల్, జూలై 14 ప్రభాతవార్త: తుమ్మలగుంట గ్రామ పంచాయతీలోని మఠం భూమి నివాసితులకు తాగునీటి సౌకర్యం కల్పించుటకు మండల అధి కారులు సహకరించాలని ఎంపిపి మూలం చంద్రమోహన్‌రెడ్డి కోరారు. సోమవారం ఎంపిపి ఛాంబర్‌లో ఎంపిడిఓ, రామచంద్ర, పంచాయతీరాజ్ ఏఇ ఉదయ్, ఇరిగేషన్ ఏఇలు హిమంత్, హేమాద్రి, తుమ్మలగుంట పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లుతో చర్చించారు. తిరుపతిరూరల్ మండలం తుమ్మలగుంట గ్రామ పంచాయతీ పరిధిలోని మఠం భూమిలో దాదాపు 300కుటుంబాలు ఇండ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారని, అందులో సగం మందికిపైగా పంచాయతీకి ఇంటిపన్నులు చెల్లిస్తున్నారని తెలిపారు. ఇంటిపన్నులు, నో-అబ్జెక్షన్ సర్టిఫికేట్స్, కరెంట్ మీటర్లు ఉన్నా, వారి పంచాయతీ మౌళిక సదుపాయాలు కల్పించలేదన్నారు. మఠం నివాసితులు తాగునీటి కోసం దాదాపు 2 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేసారు. వ్యవసాయ పంపు సెట్ల వద్దకు వెళ్ళి తాగునీటిని మోసుకొని వస్తున్నారని, వారి వర్ణణాతీతమని, మానవతా దృక్పధంతో తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. కుంట్రపాకం, ఓటేరు వినాయక కాలనీ, తుమ్మలగుంట, పేరూరు తదితర గ్రామాలలో నీటి కొరతగా ఉందని ఆయా గ్రామ ప్రజాప్రతినిధులు తమ దృష్టికి తీసుకువచ్చారని, నూతన బోర్లు డ్రిల్ చేసి నీరు అందించే ప్రయత్నం చేయాలని ఎంపిపి అధికారులను కోరారు. అలాగే కొన్ని పంచాయతీలలో సి.సి. రోడ్లు, మెటల్ రోడ్లు వేయుటకు ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. తిరుపతిరూరల్ ఉప మండలాధ్యక్షుడు విడుదల మాధవరెడ్డి, తిరుపతిరూరల్ వైకాపా అధ్యక్షుడు కొత్తపాటి మునీశ్వరరెడ్డి పాల్గొన్నారు.

## జాతీయ పోటీలకు వడమాలపేట విద్యార్థులు



వడమాలపేట, జూలై 14 ప్రభాతవార్త: రాష్ట్ర గ్రాప్లింగ్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12, 14వ తేదీల్లో తిరుపతిలోని గిరిజన భవన్ వేదికగా అండర్ 11, 13, 15 బాల బాలికలకు గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీలు నఇర్వహించారు. ఇందులో రాష్ట్రం నలుమూలల నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో వివిధ వయస్సు, బరువు కేటగిరీలలో పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వడమాలపేట విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని 9 బంగారు 7 వెండి, 5 కాంస్య పతకాలు సాధించారు. బంగారు పతకాలు సాధించిన వారు ప్రణతి 7వ తరగతి(30కేజీ), శ్రీజన్ 6వ తరగతి(22 కిలోలు), అశ్వత్ 7వ తరగతి(30 కిలోలు), సంతోష్ యాదవ్ 8వ తరగతి(27 కిలోలు), సిద్ధార్థ 10వ తరగతి(42 కిలోలు), గురు దిలీప్ 10వ తరగతి(59 కిలోలు), షణ్ముగం 10వ తరగతి(61 కిలోలు), వినయ్ కుమార్ 10వ తరగతి(69 కిలోలు) వెండి పతకాలు సాధించిన కార్తీక్ 7వ తరగతి(24 కిలోలు), దేవ హర్ష 8వ తరగతి(30 కిలోలు), తనుష్ 8వ తరగతి(27 కిలోలు), రేవంత్ 7వ తరగతి(27 కిలోలు), యశ్వంత్ 10వ తరగతి(53 కిలోలు), బంగారు వెండి పతకాలు సాధించిన క్రీడాకారులందరూ జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. వీరు ఈ నెల 26వ తేదీ నుంచి 29 తేదీ వరకు చత్తీస్‌గడ్ రాష్ట్రం బిలాస్‌పూర్ నందు ఇండోర్ స్టేడియంలో జరుగు జాతీయ స్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీలకు అర్హత సాధించారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కరుణ నవనీతం, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ విద్యా సంవత్సరంలో జరిగే అన్ని క్రీడల్లో రాణించి పాఠశాలకు గుర్తింపు తీసుకుని రావాలని కోరారు.

## ఎమర్జీన్సీ మెడిసిన్ విభాగం వేగవంతం

తిరుపతి హెల్త్, జూలై 14 ప్రభాతవార్త : ఎమర్జీన్సీ మెడిసిన్ విభాగం వేగవంతం ఎల్లప్పుడు సవాల్‌తో కూడిన రంగమని స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. స్విమ్స్ ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం అతిథి ఉపన్యాస కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి పలువురు డాక్టర్లు హాజరై వారి వారి అభిప్రాయాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు అల్లాడి మోహన్, డాక్టర్లు, అన్ని విభాగాల అధికారులు విద్యార్థులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు ప్రజలు నమ్మరు



రేణిగుంట జూలై 14 ప్రభాతవార్త : ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిపై జనసేన నాయకులు కోట వినుత, కోట చంద్రబాబు చేస్తున్న తప్పుడు ఆరోపణలను ప్రజలు నమ్మరని వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు దేవళ్ళ రమణ అన్నారు. జనసేన నాయకులు కోట వినుత, కోట చంద్రబాబు వారి దగ్గర పనిచేస్తున్న రాయుడు అలియాస్ శ్రీనివాసులు అనే వ్యక్తిని చంపి చెన్నై సమీపంలోని ఓ కాలువలో పడవేసినట్లు చెన్నై పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. అయితే వారు తమ ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేసినారన్నారు. వారి ఆరోపణలను ప్రజలు నమ్మరని తెలిపారు. చట్టం తన పని తాను చేసుకోబోతుందని తప్పు చేసిన వారికి శిక్ష పడుతుందన్నారు.

## జయలక్ష్మీకి డాక్టరేట్ ప్రదానం

తిరుపతి విద్య, జూలై 14 ప్రభాతవార్త: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న శ్రీ గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో 18 సంవత్సరాలుగా అధ్యాపకురాలుగా పనిచేస్తున్న ఎన్ జయలక్ష్మీ రియల్ టైం అప్లికేషన్ ఆఫ్ కేస్ స్టడీస్ ఆఫ్ బిగ్ డేటా అనలిటిక్స్ అండ్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అనే అంశం పై పరిశోధన చేయగా తంజావూర్ లోని ప్రిస్ట్ యూనివర్సిటీ వారు ఈమెకు 30-06-2025న డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈమె ప్రిస్ట్ యూనివర్సిటీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో ప్రొఫెసర్ గా పనిచేస్తున్న డా.ఎస్.చాముండేశ్వరి పర్యవేక్షణలో పరిశోధన గావించారు. ఈ సందర్భంగా డా.ఎన్. జయలక్ష్మీ ని కళాశాల సిబ్బంది అందరూ అభినందించారు.



## ఆర్‌సి పురం తహశీల్దార్‌గా మధుసూదన్‌రావు



రామచంద్రాపురం, జూలై 14 ప్రభాతవార్త: తహశీల్దార్‌గా మధుసూదన్ రావు సోమవారం విధులు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న వెంకటరమణ జూన్ 30న పదవీ విరమణ చేశారు. ఈ నేపధ్యంలో కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న మధుసూదన్ రావు బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన అనుభవం వుండటంతో మరోమారు ఇక్కడికి ఆయనను బదిలీ చేయడం ప్రాధాన్యత సంతరించుకున్నది. ఈ సందర్భంగా టిడిపి నాయకులు కోరా హరిప్రసాద్, లెక్కల సురేంద్ర నాయుడు, లెక్కల మహేష్ నాయుడు, చంద్రశేఖర్ రెడ్డిలు దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు.

## కురు పాండవ విద్యాభ్యాసం

రామచంద్రాపురం, జూలై 14 ప్రభాతవార్త: సి.రామాపురంలో జరుగుతున్న మహాభారత ఉత్సవాలలో భాగంగా సోమవారం కురు పాండవ విద్యాభ్యాసం హరికథను భాగవతారిణి అనుసూయ చక్కగా వినిపించారు. పాండవులు, కౌరవులు ద్రోణాచార్యుల వద్ద విద్యాభ్యాసానికి వెళ్ళడం, విద్య నభ్యశించే క్రమంలో బంతి లోతైన బావిలో పడటం దానిని అర్జునుడు తన విలు విద్యా నైపుణ్యంలో చాకచక్యంగా వెలికితీయంతో ద్రోణాచార్యుడికి అర్జునుడు ప్రియశిష్యుడు కావడం వంటి ఘట్టాలను కన్నులకు కట్టినట్లు వినిపించారు.



## మహిళలకు ముడి సరుకులు పంపిణీ



తిరుపతి హెల్త్, జూలై 14 ప్రభాతవార్త: రాస్ జన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో శివజ్యోతి నగర్ తిరుపతి నందు మహిళలకు మూడు నెలలు బ్యూటీషియన్ కోర్సు ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా జన శిక్షణ డైరెక్టర్ ఎం. మోహన్, రాస్ ఫీల్డ్ అధికారి బాలాజీ హాజరయ్యారు. డాక్టర్ మోహన్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలంటే ఏదైనా చేతివృత్తులు నేర్చుకోవాలని పిలుపు నిచ్చారు. మహళల చేతు వృత్తులు నేర్చుకొని ఆర్థికంగా ఎదగాలని తెలిపారు. బాలాజీ మాట్లాడుతూ రాస్ పొదుపు సంఘాల మహిళలకు నేర్చుకున్న వారికి లోన్స్ ఇప్పిస్తామన్నారు. బ్యూటీషియన్ నేర్చుకున్న మహిళలకు ముడి సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి. సుధాకర్‌రెడ్డి, గీత, రాజేశ్వరి, భార్గవి, మహిళలు పాల్గొన్నారు.

## అధ్యాపకున్ని అవమానించిన వారిపై చర్యలు తీసుకోరా!

తిరుపతి విద్య, జూలై 14 ప్రభాతవార్త: ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో ఎస్సీ, ఎస్టీల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని, వారిని విచక్షణా రహితంగా అవమానిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని ఏపీ అంబేద్కర్ యువజన సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు తాళ్లపాక దాము ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం దళిత సంఘ నాయకులతో కలిసి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు జరుగుతున్న అన్యాయంపై వీసీ రమణను నిలదీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెటర్నరీ వర్సిటీలో పాలన అస్థవ్యస్తంగా మారిందని, దళిత ఉద్యోగులపై, అధ్యాపకులపై సంపన్న వర్గాలు చేస్తున్న వికృత చేష్టలు శృతిమించాయనని మండిపడ్డారు. అధ్యాపకుడు రవివర్మ కుర్చీని తీసేసి అవమానించిన తీరు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైనా అందుకు కారకుడైన రవీంద్రారెడ్డిపై ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. లేనిపక్షంలో తామే సీబీఐకి ఫిర్యాదు చేసి తీరుతామని హెచ్చరించారు.

## తప్పని సర్వర్ తిప్పలు

తిరుపతి విద్య, జూలై 14 ప్రభాతవార్త: ఏపీఈఏపి సెట్ 2025 కు సంబంధించి ఇంజనీరింగ్ వెన్ఆప్షన్ల ప్రక్రియ ఆదివారం నుంచి మొదలై ఈనెల 18వ తేదీ వరకు కొనసాగనుంది. దీంతో విద్యార్థులు వెన్ఆప్షన్ల ఎంపిక ప్రక్రియను పూర్తి చేసుకునేందుకు నెట్సెంటర్ల వెంటపడ్డారు. దీంతో తిరుపతి నగరంలోని ఇంటర్నెట్ సెంటర్లు విద్యార్థులు, తల్లిదండ్రులతో కిటకిటలాడుతున్నాయి. కానీ సర్వర్ స్లోగా ఉండటం, పదినిమిషాల పాటు సర్వర్ పనిచేసి తర్వాత మొరాయించడంతో విద్యార్థులు అవస్థలు వర్ణనాతీతం. గంటల కొద్ది నెటసెంటర్లలో వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సర్వర్ సమస్య రాకుండా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## సందేహాలను నివృత్తి చేయండి : సిపిఐ

శ్రీకాళహస్తి, జూలై 14 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి జనసేన ఇన్‌చార్జిగా ఉన్న వినూత కోట వద్ద పని చేసిన డ్రైవర్ శ్రీనివాసులు అనే రాయుడి అనుమానాస్పద మృతిపై జ్యూడిషియల్ విచారణ జరిపి ప్రజల సందేహాలను నివృత్తి చేయాలని సిపిఐ సోమవారం శ్రీకాళహస్తి ఆర్‌డిఓ భాను ప్రకాష్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాసులు అనే రాయుడు హత్య ఎందుకు జరిగిందనే



అంశంపై ప్రజల్లో ఎన్నో అనుమానాలు ఉన్నాయని వాటిని నివృత్తి చేయటానికి జ్యూడిషియల్ విచారణ జరపాలని కోరారు. 2019 నుంచి వినూత కోట వద్ద ఎంతో నమ్మకంగా ఉన్న రాయుడును ఎందుకు హత్యచేశారో తెలియాల్సి ఉందన్నారు. అంతనేరం ఏం చేసాడు? అనే అంశం ప్రజలకు వాస్తవాలు తెలియాల్సి ఉందన్నారు. ఈ హత్యకు వ్యక్తిగత కారణాలా? లేక రాజకీయ కారణాలా? అనేది విచారణలో తేలాల్సి ఉందన్నారు. జ్యూడిషియల్ జరిపి వాస్తవాలు తెలియజేయాల్సి ఉందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని జనమాల గురవయ్య వారి సహచరులు కోరారు.

## బృందమ్మకాలనీ బహు సమస్యల నిలయం



శ్రీకాళహస్తి, జూలై 14 ప్రభాతవార్త : మున్సిపల్ పరిధిలోని బృందమ్మ కాలనీలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి వెళ్ళి ఏడాది పాలనలో చేపట్టిన ప్రగతి పనులను వివరించారు. అయితే బృందమ్మకాలనీ వాసులు ఎంతో చక్కగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని నాయకులకు మొరబెట్టుకున్నారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్ సారధ్యంలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడాదిలో పట్టన పరిసరాల్లోని కాలనీల్లో చేపట్టిన ప్రగతిని వివరించారు. అయితే కాలనీలోకి అడుగుపెట్టాలంటే మురుగునీటి కాలువలు అడ్డంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు విజయకుమార్‌నాయుడు వెంటనే మున్సిపల్ ఇంజనీర్‌కు సమాచారం అందించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమాల్లో పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి కంఠారమేష్; యూనిట్‌ఇన్‌చార్జి రమేష్‌బాబు, బూత్ ఇన్‌చార్జి భాస్కర్‌గౌడ్, అనంద్, నాగరాజు, గోపి, వెంకటేష్; గుత్తా విజయ కుమార్ నాయుడు చెంచయ్య, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## 23 ఏళ్ళుగా భూములను అనుభవిస్తున్నా పట్టాలివ్వరా?

శ్రీకాళహస్తి రూరల్, జూలై 14 ప్రభాతవార్త : మండలం ఎల్లంపల్లి గిరిజన కాలనీ వాసులు 23 సంవత్సరాలుగా పోరాటాల తరువాత భూమి లను అనుభవిస్తున్నా రెవెన్యూశాఖ పట్టాలు ఇవ్వక లొల్లి చేయటం తగదని న్యూ డెమాక్రసి జిల్లా కార్యదర్శి రాయపనేని హరికృష్ణ ధ్వజ మెత్తారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు వెంటనే పట్టాలు మంజూరు చేయాల న్నారు. 23 సంవత్సరాలు క్రితం



సుధీర్ఘ పోరా టాల తరువాత సాగుకు అనుమతించారని వివరించారు. ఈ నేపధ్యంలో పార్టీ నాయకులు రాయపనేని హరికృష్ణ, పి.వెంకటరత్నంలు మాట్లాడుతూ ఎంతో కాలం ఈ భూములనుగిరిజనులకు అప్పగించుటకు పోరాటాలు చేసామన్నారు. అప్పటి నుంచి యానాదులు ఆ భూములను సాగు చేసుకొని జీవిస్తున్నారని వివరించారు. కానీ సాగు చేసుకోవటం తప్ప వారికి హక్కు లేదన్నారు. ఈ నేపధ్యంలో సోమవారం ఎల్లం పల్లి యానాదులతో సమావేశం అయ్యారు. ఇక్కడ పోరాటాల తరువాత ఒక్కొక్క కుటుంబానికి 40సెంట్లు చొప్పున ఇవ్వటం జరిగిందన్నారు. ప్రజాసమస్యలపై స్పందించే ఆర్‌డిఓ వెంటనే న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పాటూరు వెంకటరత్నం, ఎం.అరుణ, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా సంకటహార చతుర్థి

పుత్తూరు రూరల్, జూలై 14 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణం మున్సిపల్ పరిధిలోని మరాఠిగేట్‌లో వెలసిన శ్రీ పరిశుద్ధ వినాయకస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం సంకటహార చతుర్థి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, అలంకరణలు చేశారు. భక్తులు స్వామివారికి కర్పూర హారతులు ఇచ్చి పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.


కెనరా బ్యాంక్ केनरा बैंक Canara Bank
Together we can

తిరుపతి తిరుమల శాఖ సెల్: 80999 87333

**స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)**

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002లోని రూల్3 తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలు వినియోగించు కుంటూ **కెనరా బ్యాంకు, తిరుపతి తిరుమల శాఖ వారి** యొక్క అధీకృత అధికారిగా ఉన్న దిగువ సంతకందారు నోటీసులో తెలిపిన మొత్తం **రూ. 23,64,296.12 పై (ఇరవై మూడు లక్షల అరవై నాలుగు వేల రెండు వందల తొంభై ఆరు రూపాయల పన్నెండు పైసలు మాత్రమే) మరియు తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులను** సదరు నోటీసు అందుకున్న తేది నుంచి 60 రోజుల్లో తిరిగి చెల్లించవలసినదిగా రుణగ్రహీత **శ్రీ కె.యువరాజారెడ్డి మరియు గ్యారంటారు శ్రీ బి.మునిస్వామిరెడ్డి** గార్లను కోరుతూ **02.05.2025** వ తేదీ గల డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది.

రుణగ్రహీత సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, దిగువ సంతకందారు సదరు చట్టంలోని నిబంధన 8&9తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ తెలిపిన ఆస్తిని **08.07.2025**వ తేదీన స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీతకు, హామీదారులకు, సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

సదరు ఆస్తితో ఏ వ్యవహారం జరుపరాదని, ముఖ్యంగా రుణగ్రహీత/సహరుణగ్రహీత/గ్యారంటారును మరియు సాధారణ ప్రజలను ఇందుమూలముగా హెచ్చరించడమైనది మరియు సదరు ఆస్తితో ఏవేని వ్యవహారాలు జరుపదలిస్తే కెనరా బ్యాంకు వారికి **రూ. 23,64,296.12 పై (ఇరవై మూడు లక్షల అరవై నాలుగు వేల రెండు వందల తొంభై ఆరు రూపాయల పన్నెండు పైసలు మాత్రమే)** మరియు దానిపై వడ్డీ మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, చార్జీలు మొదలైనవి చెల్లించుటకు లోబడి ఆ విధంగా చేయవచ్చును.

సెక్షన్ 13(8) క్రింద సెక్యూర్డ్ ఆస్తులను తిరిగి పొందేందుకు సమయం ఇవ్వడమైనదని రుణగ్రహీతలకు తెలియజేయడమైనది.

**స్థిరాస్తి వివరణ**

శ్రీ కె.యువరాజారెడ్డి గారికి చెందిన భూమి మరియు భవనం మరియు క్రింద తెలిపిన షెడ్యూలులో ని ఆస్తి యొక్క ఈక్విమెంటరీ మరియు అనుబంధ హక్కులతో సహా.

**షెడ్యూలు:-** చిత్తూరు జిల్లా, శ్రీ బాలాజి రిజిస్ట్రేషన్ జిల్లా, తిరుపతి - తిరుపతి రూరల్ సబ్ జిల్లా, తిరుపతి రూరల్ మండలం, ముండ్లపూడి గ్రామలెక్కదాఖలా పట్టానెం.191, సర్వేనెం.538/1, 538/1బి, 538/3, 535/1బి, 2బి, 3,4,5,6లో ఎ.4.31సెంట్లలో తుడా వారిచే డిడిస్ ఎల్.పి.నెం. 26/బి1/2007, తేది: 04.07.2007 (ఆర్.ఓ.సి.నెం. 292/బి1/2007)గా ఫైనల్ అప్రూవల్ పొంది వేసిన పద్మాలయ నగర్ ప్లాట్లలో తిరుపతి రూరల్ తహసీల్దార్ వారి కార్యాలయంలోని సర్వేయర్ వారి రిపోర్టు డిఇఆర్ నెం.011400117487, తేది: 07.10.2014 ప్రకారం ప్లాటు నెం.39 గల ఖాళీ స్థలం యొక్క కొలతలు: తూర్పు నుండి పడమర: ఉత్తరం వైపు 47అ. లేదా 14.335 మీ. దక్షిణం వైపు: 48అ. లేదా 14.640మీ. ఉత్తరం నుండి దక్షిణం: తూర్పు వైపు : 92అ. లేదా 28.060 మీ. పడమర వైపు: 102అ. లేదా 31.110మీ. మొత్తం విస్తీర్ణం 4607.50చ.అ. లేదా 511.94 చ.గ. హద్దులు: తూర్పు: పార్కుకు వదలిన 6.5అ. వెడల్పు గల రోడ్డు , పడమర: ప్లాటు నెం.40, ఉత్తరం: 40అ. వెడల్పు గల రోడ్డు, దక్షిణం: సర్వేనెం.537 లోని భూమి. ఇందున నిర్మించిన జి+1 ఆర్.సి.సి. బిల్డింగ్

స్థలం :తిరుపతి తేది: 08.07.2025 సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

# వైసిపి ప్రభుత్వం అభివృద్ధి శూన్యం : ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ



బాలాయపల్లి, జూలై 14 ప్రభాతవార్త : గత వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. మండలంలోని మేల్చూరు గ్రామంలో సుపరి పాలనకు తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రసంగి ంచారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ ఏడాది కూటమి పాలనలో జరిగిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గత వైసిపి ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టలేదని, నిధులన్నీ ఖాళీ చేశారని మండిపడ్డారు. గ్రామాల్లోకి వెళ్లి ప్రజలలో మమేకమై ప్రజా సమస్యలు తెలుసుకుని వారి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. మేల్చూరు గ్రామంలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే కురుగొండ్ల కురుగొండ్ల రామకృష్ణ పాల్గొన్నారు. మేల్చూరు ఎస్టి కాలనీలో నీటి సమస్య ఉందని, ఇంటి స్థలం వివాదాలు పరిష్కరించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని మహిళలు వచ్చారు. తెలుగు గంగ నీరు కాలువకు ఇవ్వాలని పలువురు రైతులు గ్రామస్తులు ఎమ్మెల్యేకు తెలిపారు. మాజీ ఎంపీపీ చైర్మన్ సింగంశెట్టి భాస్కరరావు మాట్లాడుతూ మండలంలో అనేక సమస్యలు ఉన్నాయని, మండలానికి ఒక రోజు కేటాయించి పరిష్కరించాలని ఎమ్మెల్యే రామకృష్ణను కోరారు. చెరువులకు తెలుగు గంగ నీరు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచి వనమ్మ, తహసిల్దార్ విజయలక్ష్మి మండల పార్టీ అధ్యక్షుడు రావి మస్తాన్ నాయుడు, టిడిపి నేతలు నల్లబోతుల మురళి, శ్రీనివాసులు మాదిగ, కొర్రపాటి రామచంద్ర నాయుడు, కూని శ్రీహరి, జడపల్లి కోటేశ్వర గౌడ్, సివికే నాయుడు, శేఖర్ నాయుడు, క్లస్టర్ ఇంచార్జి సత్యం నాయుడు, దాసరి రాజగోపాల నాయుడు, కోటేశ్వరరావు, బిల్లు సిసింద్రీ యాదవ్, మారెళ్ళ వెంకటాద్రి, ఆది వెంకట కృష్ణారెడ్డి, సాగి నరసింహులు నాయుడు, నారాయణరెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు రమణయ్య, ముప్పాళ్ల మాధవయ్య నాయుడు, గోపికృష్ణరెడ్డి, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విపి అగ్రహారం గ్రామ నిర్వాసితుల నిరసన

కోట, జులై 14 ప్రభాతవార్త: మండలం విశ్వనాథపుర అగ్రహారం గ్రామానికి చెందిన నిర్వాసితులు సోమవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. తమ పట్టా పొలాల్లో సాగరమాలకు చెందిన కాంట్రాక్టర్లు రోడ్లు నిర్మాణం చేపట్టారని, కానీ తమకు పరిహారం ఇవ్వలేదని ఆరోపించారు. పలుమార్లు సాగరమాలకు చెందిన కాంట్రాక్టర్లను ప్రశ్నించినా ఎలాంటి ఉపయోగం లేదన్నారు. ఆ మేరకు తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కె.జయజయరావు మాట్లాడుతూ అర్హులందరికీ పరిహారం మంజూరు చేయిస్తామని చెప్పారు.

## గురుకులం విద్యార్థినులకు గొడుగులు పంపిణీ



సూళ్లూరుపేట, జులై 14 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులకు సోమవారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చేతులు మీదుగా గొడుగులు పంపిణీ చేశారు. పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఆకుతోట రమేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన అభిమానులు గురుకులంలోని 250 మంది విద్యార్థినులకు వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గొడుగులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఎజి కిషోర్, మాధవనాయుడు, నలజాం రాము, అలవల శ్రీనివాసులు, వాకిచర్ల రమేష్, దంతాల రవి, ఆలీభాయ్, గిరి, సిహెచ్ రమణయ్య, జోగేశ్వరరావు, కొండలరావు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రేచర్ల వాణి తదితరులు పాల్గొన్నారు.

## నల్లబ్యాడ్జిలతో ఎనర్జీ అసిస్టెంట్ల నిరసన



సూళ్లూరుపేట, జులై 14 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలో భాగంగా సోమవారం నల్ల రిబ్బన్లు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు కైలాసం అశోక్‌రాజు మాట్లాడుతూ నల్ల రిబ్బన్లతో విధులకు హాజరు కావడంతో పాటు తమ సమస్యలను పరిష్కరించకపోతేఈ నెల 21వ తేదీన చలో విజయవాడకు వెళ్లి మహాధర్నా చేపడతామన్నారు. తమ న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వం సానుభూతితో పరిశీలించాలని అశోక్‌రాజు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో సుపరిపాలనలో తొలి అడుగు



సూళ్లూరుపేట, జులై 14 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని దేగలపాలెం, సోనియానగర్, వివిఎన్ఆర్ నగర్, కస్వారెడ్డిపాలెం తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అలాగే మండల పరిధిలోని ఆబాక, సామంతుమల్లాం గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని ఎమ్మెల్యే విజయశ్రీ ప్రజలకు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పెట్టుకుని పనిచేస్తున్నారని, ప్రజలకు మెరుగైన పరిపాలన అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, మాధవనాయుడు, ఎజి కిషోర్, కొక్కు శంకరయ్య, సామంతుమల్లాం సుబ్రహ్మణ్యం, సుధాకర్‌రెడ్డి, పాకం వెంకటసుబ్బయ్య, నలజాం రాము, కొండలరావు, గిరి, సిహెచ్ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## మేత భూమిలో ఫ్యాక్టరీలకు అనుమతులు ఇవ్వొద్దు



గూడూరు, జూలై 14 ప్రభాతవార్త : రూరల్ మండల పరిధిలోని మేకనూరు గ్రామస్తులు వారి గ్రామానికి చెందిన మేత పోరంబోకు భూముల్లో ఫ్యాక్టరీల నిర్మాణానికి ప్రయత్నాలు చేస్తున్నారని, వెంటనే ఆపాలని సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సుమారు 150 మంది గ్రామస్తులతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు వారు వినతి పత్రం అందజేసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ మేకనూరు గ్రామంలో సర్వేనెంబర్ 1లో 260 ఎకరాల మేత పోరంబోకు భూమి ఉందని, ఈ భూమిని నమ్ముకుని సుమారు 400 కుటుంబాలు వారు పశువులు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారని, ఈ భూమిలో కొందరు ఫ్యాక్టరీలను నిర్మించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, ఇదే జరిగితే మేము జీవనాధారం కోల్పోతామని, ఫ్యాక్టరీ ఎలా నిర్మాణానికి ఎటువంటి పరిస్థితుల్లో మేము ఒప్పుకోమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొర్ల విజయ, ముమ్మడి ఉమామహేశ్వరి, అమరేంద్ర, రమేష్, గంగాధర్ రెడ్డి, నల్లిబోయిన కృష్ణయ్య, తిరుపాలయ్య, నీటి సంఘం అధ్యక్షులు మద్దాలి కృష్ణయ్య, రమణయ్య, మల్లికార్జునలు పాల్గొన్నారు.

## రోడ్డు పనుల మరమ్మతులపై విచారణ చేపట్టండి

**- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంటా శ్రీనివాసులు రెడ్డి**



గూడూరు, జూలై 14 ప్రభాతవార్త : మండల పరిధిలోని గూడూరు నుండి విందూరు మీదుగా గిద్దలూరు వరకు చేపట్టిన మరమ్మతుల పనుల పై విచారణ చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంటా శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. సోమవారం గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాకి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు నుండి విందూరు మీదుగా గిద్దలూరు వరకు చేపట్టిన రోడ్డు మరమ్మతు పనుల్లో అవకతవకలు జరిగాయని, అలాగే గూడూరు నియోజకవర్గంలోని చిల్లకూరు కోట, వాకాడు మండలాల్లో జరిగిన సిలికా అక్రమ మైనింగ్ వీటన్నిటిపై విజిలెన్స్ అధికారులతో విచారణ జరిపించి, తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చిల్లకూరు వేమయ్య, సుబ్బరాజు, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాలికను మోసం చేసిన కేసులో ఫోక్స్ కేసు నమోదు

వెంకటగిరి, జూలై 14, ప్రభాతవార్త : పట్టణంలోని అనంతపురంకు చెందిన మొద్దు కృష్ణ మైనర్ బాలికను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసినందుకు ఫోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఏడుకొండలు తెలిపారు. కృష్ణకు పెళ్లి అయిందని మహిళలు బాలికను ప్రేమ పేరుతో ఇబ్బంది పెట్టారని తెలిపారు. ఫోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

## విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ వల్ల పొంచి ఉన్న ప్రమాదం



వెంకటగిరి, జూలై 14 ప్రభాతవార్త : 14వ వార్డు అరుంధతి వాడ వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ వలన ప్రమాదం పొంచి ఉందని స్థానికులు వాపోయారు. విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ శిథిలావస్థకు చేరుకోవడం వల్ల ఆ మార్గంలో వెళ్లే చిన్నారులకు ప్రమాదం పొంచి ఉందని వారు తెలిపారు. విద్యుత్ వైర్లు కూడా కిందకు జారిపోయి ఉన్నట్లు చెప్పారు. మున్సిపాలిటి సుదర్శన్ నగర్ సచివాలయంలో 8 సోమవారం ప్రజా విజ్ఞప్తుల దినం నిర్వహించారు. ఇందులో భాగంగా 14వ వార్డు కౌన్సిలర్ వెంకటగిరి నియోజకవర్గ వై.యస్.ఆర్.సి.పి పార్టీ ఆర్.టి.ఐ. విభాగపు అధ్యక్షుడు ఆరి శంకరయ్య ప్రజాల దగ్గరనుండి సమస్యలపై ఇచ్చిన వినతిపత్రాలను సేకరించారు.మునిసిపల్ చైర్మన్, కమిషనర్ పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

# గూడూరు డివిజన్

## దుకాణంలో చోరీ

గూడూరు, జూలై 14 ప్రభాతవార్త : పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ సమీపంలో ఉన్న ద్రౌపది షాపింగ్ కాంప్లెక్స్‌లోని నాలుగు దుకాణాలలో పై రేకులను కట్ చేసి దుండగులు లోపలికి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. గూడూరు పట్టణంలోని ద్రౌపది షాపింగ్ కాంప్లెక్‌లో నాలుగు దుకాణాలపై రేకులను కట్ చేసి దొంగలు లోనికి ప్రవేశించి సెల్ఫోన్ రిపేర్ షాప్‌లో నాలుగు సెల్ ఫోన్లను 2000 రూపాయల నగదును దోచుకెళ్లారు. అలాగే చిల్లర అంగడి దుకాణంలో 4000 రూపాయల నగదు ఎత్తుకు వెళ్లారు. మరో రెండు దుకాణాలలో సామాన్లు తప్ప నగదు ఏమి పెద్ద లేకపోవడంతో వెళ్లిపోయారు పట్టణ నడిబొడ్డు టవర్ క్లాక్ సెంటర్ సమీపంలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లో దొంగతనం జరగడం గత రెండు రోజుల క్రిందట గమల్లపాలెంలో 30 సవర్ల బంగారం చోరీ జరగడంతో పట్టణంలోని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

## పీజీఆర్ఎస్‌లో పలు అర్జీలు



వాకాడు, జూలై 14 ప్రభాతవార్త: మండల కేంద్రమైన వాకాడు తహశీల్దార్ కార్యాలయంలోని తహశీల్దార్ రామయ్య ఆధ్వర్యంలో సోమవారం గ్రీవెన్స్‌డే కార్యక్రమం జరిగింది. పిజిఆర్ఎస్‌లో మండల స్థాయి అధికారులు, వీఆర్వోలు కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు. పిజిఆర్ఎస్‌లో వచ్చినటువంటి అర్జీలను సత్వరమే పరిష్కరిస్తామని తహశీల్దార్ అన్నారు. ముఖ్యంగా హౌసింగ్, నివేశ స్థలాలు, భూమి సంబంధించిన పలు అర్జీలు వచ్చాయన్నారు. ఈ పీజీఆర్ఎస్‌లో ఎంపీడీవో శ్రీనివాసులు, విద్యుత్ ఏఈ విజయలక్ష్మి, ఆర్డబ్ల్యు సిఏఈ సుమాంజలి, ఎంఈఓ నసీంఅలీ, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో విజయ, సర్వేయర్లు, తహశీల్దార్ సిబ్బంది,అంగన్వాడిసిబ్బంది, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాత సుఖీభవకి రైతులు దరఖాస్తు చేసుకోవాలి

బాలాయపల్లి, జూలై 14 ప్రభాతవార్త : అన్నదాత సుఖీభవ పథకానికి రైతులు వెంటనే దరఖాస్తులు చేసుకోవాలని ఏ డి ఏ ప్రవీణ తెలిపారు. వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి మండలాల్లో 8,000 మంది రైతులు అన్నదాత సుఖీభవ అర్హులుగా ఉన్నట్లు తహశీల్దార్ లాగిన్‌లో ఉన్నట్లు చెప్పారు. 8000 మంది జాబితాలో 6000 మంది చనిపోయినట్లు ఉన్నాయని చనిపోయిన వారి స్థానంలో కుటుంబ సభ్యులు వెబ్ ల్యాండ్‌లో సవరణలు చేసుకోవాలని కోరారు.

## హర్షం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే

వెంకటగిరి, జూలై 14 ప్రభాతవార్త: కేంద్ర మాజీ మంత్రి, సీనియర్ టిడిపి నాయకులు పూసపాటి అశోక్ గజపతిరాజుకు గోవా గవర్నర్‌గా ఇవ్వడం పట్ల ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ వ్యక్తం చేశారు. అశోక్ గజపతి రాజు పార్టీకి క్రమశిక్షణ కలిగిన నాయకుడుగా పని చేశారని తెలిపారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు పార్టీకి పనిచేసిన వారికి ఎప్పుడు మంచి గుర్తింపు ఇస్తారని తెలిపారు.

## మున్సిపల్ కార్మికుల సమ్మె




వెంకటగిరి, జూలై 14 ప్రభాతవార్త: ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని, సమ్మె కాలపు ఒప్పందాలకు జీవోలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రెండో రోజు కూడా సమ్మె చేశారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులకు జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ సెక్షన్ వాటర్ విభాగం సిఐటియు నాయకులు వెంకటసుబ్బయ్య, నరసింహులు, బుజ్జమ్మ మున్సిపల్ యూనియన్ పారిశుధ్య విభాగం సిఐటియు నాయకులు జిల్లా జాయింట్ సెక్రెటరీ పెంచలయ్య, సుబ్రహ్మణ్యం, రమణయ్య, సుబ్బరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబే ఉండాలి

**- రైతు విభాగ అధ్యక్షుడు గోపినాథ్‌రెడ్డి**



కేవీబీపురం జూలై 14 ప్రభాతవార్త: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉండాలని జిల్లా నియోజకవర్గ రైతు విభాగ అధ్యక్షుడు కనపర్తి గోపినాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని మేజర్ పంచాయతీలోని కళత్తూరు దళితవాడలో సోమవారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని గోపినాథ్‌రెడ్డి, టీడీపీ కార్యకర్తలు పార్టీ కమిటీ అధ్యక్షులతో కలసి తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గత ఐదేళ్లలో అన్ని రంగాల్లోను విధ్వంసం వాటిల్లిందన్నారు. అయితే టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరిపాలన దక్షత వల్ల రాష్ట్రం విధ్వంసం నుంచి వికాసం వైపు పరుగులు తీస్తున్నట్లు ఆయన తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానం మేరకు సూపర్ సిక్స్ పథకాలను అమలుచేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే మెగా డీఎస్సీ, ఏడాదికి ఉచితంగా మూడు వంట గ్యాస్ సిలిండర్లు, తల్లికివందనం, అన్నా క్యాంటీన్లు ఉన్నట్లు ఆయన వివరించారు. ఇదేగాక పాడి రైతులను ఆదుకునే దిశగా పశువుల షెడ్లు, రాయితీ ధరలపై పశువులు దాన పంపిణీ చేస్తున్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. అలాగే వచ్చే నెలలో మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం అమలు చేయబోతున్నామన్నారు. ప్రభుత్వ సదుద్దేశంతో ప్రజలకు అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్న ఉద్దేశంతో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆయన గుర్తు చేశారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందించడంతో పాటు వారి సమస్యలను కూడా అడిగి తెలుసుకున్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాజకీయ లబ్ధికై జగన్ చేస్తున్న డ్రామాలు ఆపాలి!

**- ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం**
**- మామిడి రైతుల్ని ఆదుకుంది సిఎం చంద్రబాబే**



కుప్పం, జూలై 14 ప్రభాతవార్త : రాజకీయ లబ్ధికి వైఎస్సార్సీ అధినేత వైఎస్ జగన్ చేస్తున్న డ్రామాలు ఆపాలని ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. సోమవారం కుప్పం ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిత్తూరు జిల్లాలో మామిడి రైతుల్ని రెచ్చగొట్టేందుకు వచ్చారని పేర్కొన్నారు. గతవైఎస్సార్సీ పాలనలో రైతుల్ని ఎలా ఆదుకున్నారో రైతులు, ప్రజలకు తెలుసన్నారు. సిఎం చంద్రబాబునాయుడు రైతుబిడ్డ అని ఆయనకు రైతుల కష్టాలు తెలుసుకాబట్టే తోతాపురికి మద్దతుగా కిలో రూ4.లు ప్రభుత్వం రాయితీగా ఇస్తోందన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మామిడి రైతుల సమస్యలు పరిష్కరించేందుకు సిఎం చంద్రబాబునాయుడు కుప్పంలోనే జిల్లా కలెక్టర్, పల్ప్ పరిశ్రమల యజమానులతో చర్చించారనే విషయం గుర్తు చేశారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి చెందిన పిఎల్ఆర్ కంపెనీ రైతులనుంచి మామిడిని కిలో 1-2రూ.లకు మాత్రమే కొనగోలు చేసేలా సిండికేట్ చేయలేదా అని ప్రశ్నించారు. తోతాపురి సాగు చేసిన రైతులు పంట వివరాలు రైతు సేవా కేంద్రాల్లో అందిస్తే వారి బ్యాంకు ఖాతాల్లోనే నగదు జమ అవుతుందని ఈ విషయం రైతులు గమనించాలని కోరారు. కుప్ప ం ప్రాంతంలో ఉద్యానవన పంటలసాగు అధికంగా ఉంటుందని ఇక్కడ రైతుల ఆదాయం పెరిగేలా సిఎం చంద్రబాబు చర్యలు చేపడుతున్నారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి డా॥ బిఆర్ సురేష్‌బాబు మాట్లాడుతూ ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో మామిడి దిగుబడి అధికం కావడంతో పాటు గతేడాది పల్ప్ ఉత్తత్తుల ఎగుమతులు ఆశించిన మేర లేకపోవడంతో కొనుగోళ్లపై పరిశ్రమలు ఆసక్తి చూపలేదన్నారు. అయితే కూడా సిఎం చంద్రబాబునాయుడు వారితో చర్చించి రైతులనుంచి పంట కొనుగోలుకు చిత్తశుద్ధితో కృషి చేశారన్నారు. మామిడి రైతుల సమస్యలపై ప్రధాని మోడీకి సైతం లేఖరాశారన్నారు. హెలికాప్టర్లలో తిరిగే వైఎస్ జగన్ రైతులకు చేసింది ఏమీ లేదని పేర్కొన్నారు. కేవలం ఆయన బల ప్రదర్శన కోసమే బంగారుపాళ్యంలో పర్యటించారన్నారు. రైతులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. సమావేశంలో టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, కడ సభ్యుడు రామచంద్ర, నేతలు రాజా, మహే ంద్ర, వసంతమ్మ, సంతోష్ పాల్గొన్నారు.

## ఉపాధి ఆధారిత ప్రొత్సాహక పథకంతో ఉపాధి కల్పన

**-ఈపిఎఫ్ కమిషనర్ 2 సతీశ్‌కుమార్**



తిరుపతి, జూలై 14 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఉపాధి ఆధారిత ప్రోత్సాహక పథకం ద్వారా అన్ని రంగాలల్లో ఉపాధి కల్పన మెరుగుపడుతోందని పీఎఫ్ కమీషనర్ సతీశ కుమార్ పేర్కొన్నారు. తిరుపతిలోని ప్రాంతీయ భవిష్య నిధి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పథకం కింద మొదటిసారి ఉద్యోగంలో చేరిన వారికి ఒకనెల వేతనం రూ.15,000 వరకు ప్రోత్సాహకంగా నగదు అందచేస్తారన్నారు. అన్ని రంగాల్లోని యాజమాన్యాలు రెండేళ్ళు పాటు అవసరమైన ప్రోత్సాహకాలు అందచేస్తామని చెప్పారు. ఈఎల్ఐ పథకం ద్వారా రూ. 99,446 కోట్లు వ్యయంతో దేశంలో రెండేళ్ళ కాలంలో 3.5 కోట్లు మందికి ఉద్యోగాలు కల్పించే దిశగా ప్రోత్సహకాలను అందించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. 2025 ఆగస్టు 1 నుంచి 2027 జూలై 31 మధ్య కాలంలో కల్పించిన ఉద్యోగాలకు ఈ పథకం ప్రయోజనాలు వర్తిస్తాయని చెప్పారు. మొదటి సారిగా ఈపీఎఫ్‌లో నమోదు చేసుకున్న ఉద్యోగులు, రూ.లక్ష వరకు వేతనం పొందే ఉద్యోగులు దీనికి అర్హులని ప్రకటించారు. పొదుపు అలవాటును ప్రోత్సహించేందుకు వారికి అందించు ప్రోత్సాహకంలో కొంత మొత్తాన్ని డిపాజిట్ చేస్తారని తెలిపారు. ప్రధానంగా తయారీ రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు చెప్పారు.

## ఆర్డీఓలు వెబ్ ల్యాండింగ్ ప్రక్రియను స్వయం పర్యవేక్షణ

**- జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి ఆదేశం**

చిత్తూరు, జులై 14 ప్రభాతవార్త: వెబ్ ల్యాండింగ్ ప్రక్రియను తహసిల్దార్లను సమన్వయం చేసుకుని ఆర్డీఓలు స్వయంగా పర్యవేక్షించాలని జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని జెసి ఛాంబర్ నుండి సోమవారం జెసి విద్యాధరి పిజిఆర్ఎస్ దరఖాస్తుల పెండెన్సీ, ఇంటి పట్టాల పంపిణీపై జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి డిఆర్ఓ మోహన్‌కుమార్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీఓలు, తహసిల్దార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జెసి మాట్లాడుతూ వెబ్ ల్యాండింగ్‌కు సంబంధించి తహసిల్దార్ల నుండి ఒరిజినల్ ఫైల్స్‌ను తెప్పించుకుని ఆర్డీఓలు తమ కార్యాలయంలో స్వయంగా పరిశీలించి కలెక్టరేట్‌కు పంపాలన్నారు. ఈ ప్రక్రియకు అదనపు సిబ్బంది అవసరం అయితే మండలాల నుండి సిబ్బందిని కేటాయించు కోవాలన్నారు. అర్జీదారులను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పించుకోకుండా స్లాట్లు ఇచ్చి దరఖాస్తులను స్వీకరించాలన్నారు. రీ-సర్వేకు సంబంధించి జిల్లాలో మొదటి దశలో 31 గ్రామాల్లో ప్రక్రియ చేపట్టడం జరిగిందని, రీ-సర్వే పూర్తయిన గ్రామాలకు సంబంధించి ఆర్ఓఆర్‌లను వెంటనే ఆర్డీఓలు పబ్లిష్ చేయాలని, మిగిలిన గ్రామాల్లో తహసిల్దార్లను సమన్వయం చేసుకుని ఆర్డీఓలు నెలాఖరులోపు 13 నోటిపికేషన్‌ను పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గత రెండు నెలలు నుండి ఎఫ్‌సి షాపుల వద్దనే రేషన్ పంపిణీ చేపట్టడం జరిగిందని, సివిల్ సప్లై అధికారులు డీలర్లతో సమీక్ష చేసుకుని వృద్ధులు, వికలాంగులకు ఇంటింటి రేషన్ పంపిణీ ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలన్నారు. మండలాల్లో తహసిల్దార్లు సిడిపిఓలను సమన్వయం చేసుకుని రేషన్ అందని అంగన్‌వాడీ కేంద్రాలను ఎఫ్‌సి షాపులతో మ్యాపింగ్ చేసి రేషన్ అందించాలన్నారు. ఇంటి పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను పరిశీలించి అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, ఇంటి పట్టా మంజూరు కోసం సిఫార్సు చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా ల్యాండ్స్ అండ్ సర్వే ఎడి జయరాజ్, డిప్యూటీ కలెక్టర్లు అనుపమ, విజయలక్ష్మీలు, కలెక్టరేట్‌లోని సెక్షన్ సూపరిటెండెంట్లు పాల్గొన్నారు.

## వెండి నాగపడగల బహూకరణ



శ్రీకాళహస్తి,జూలై 14 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం ఉదయం విజయనగరం జిల్లా బొబ్బిలి వాస్తవ్యులు లక్ష్మీదంపతులు వాయులింగేశ్వరుని దర్శించుకొని ఎఇఓ మోహన్‌కు తాము వెండి నాగపడగలు వితరణ ఇవ్వాలని కోరారు. దాంతో ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి ఛాంబర్‌లో 3.18కిలోల ఒరెండు వెండి నాగపడగలను వితరణగా అందించారు. వారికి ఆలయంలో స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనంతో పాటు వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు నిత్యాన్న ప్రసాదంలో భోజనాలు అందించారు.ఈ కార్యక్రమాల్లో ఇఓ డి.బాపిరెడ్డితో పాటు ఎఇఓ మోహన్ పాల్గొన్నారు.

## బాబు అన్ని మోసపూరిత వాగ్దానాలు : మాజీ మంత్రి పెద్దిరెడ్డి



సదుం, జూలై 14 ప్రభాతవార్త : సీఎం చంద్రబాబువి అన్నీ మోసపూరిత వాగ్దానాలు అని మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం ఎర్రాతి వారి పల్లెలో బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఎప్పుడు అధికారంలో వచ్చిన ప్రజలను మోసం చేయడమే ఆయన నైజం అన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపిందని చెప్పారు. తల్లికి వందనం పూర్తి స్థాయిలో అమలు చేయలేదని కేవలం 3000 కోట్ల రూపాయలే నిధులు మంజూరు చేశారని ఆరోపించారు. సూపర్ సిక్స్ పథకం అమలు చేస్తానని మాట ఇచ్చిన చంద్రబాబు ప్రజలకు చీటింగ్ చేశారనీ మహిళలకు ఉచిత బస్సు పథకం జిల్లాలకు మాత్రమే అమలు చేస్తానని చంద్రబాబు అంటున్నారని ఈ ఉచిత బస్సు పథకం శ్రీకాకుళం నుంచి కుప్పం వరకుఅమలు చేయాలని కోరారు. జగన్మోహన్ రెడ్డి కరోనా కాలంలోనూ సంక్షేమ పథకాలు అమలు చేశారనీ చెప్పారు. ఇచ్చిన ప్రతి హామీని జగన్మోహన్ రెడ్డి అమలు చేశారని ఈ బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని గడపగడపకు తీసుకెళ్లాలనీ ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ అబ్జర్వర్ అనిషా రెడ్డి, శ్రీనాధ రెడ్డి, వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, మాజీ తితిదే బోర్డు సభ్యుడు పోకల అశోక్ కుమార్, పులిచెర్ల సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు రెడ్డిశ్వర రెడ్డి, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ సహదేవ రెడ్డి, ఎంపీపీ మాధవి, జడ్పిటిసి సోమశేఖర్ రెడ్డి, చిత్తూరు జిల్లా వైసిపీ ఐటీ వింగ్ అధ్యక్షుడు ప్రకాష్ రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు అమరావతి పుట్టరాజు, ధనుంజయ రెడ్డి , ఎంపీటీసీ మల్లికార్జున మండల కో ఆప్షన్ నెంబర్ ఇమ్రాన్, వైసిపి మండల అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, మాజీఅధ్యక్షుడు కృష్ణారెడ్డి, సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తీశ్వరాలయంలో సంకటహర చతుర్థి



శ్రీకాళహస్తి,జూలై 14 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అంజంజి వినాయకుని ఆలయం వద్ద సోమవారం సంకటహరచతుర్థి పూజలను అంగరంగా వైభవంగా నిర్వహించారు. సోమవారం ఆలయంలో సంకటహర చతుర్థి పూజలను కన్నుల పండువగా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు ఎస్ఎంకే శ్రీనివాసులు స్థానిక సంప్రదాయం మేరకు హోమాలు ఏర్పాటు చేసారు.కలశాన్ని స్థాపించి పూజలు నిర్వహించారు.వేదపండితులు వేద మంత్రాలను పఠిస్తుండగా శ్రీనివాసగురుకుల్ కార్యక్రమాలను నిర్వహించి పూర్ణాహుతి గావించారు.ఈ సందర్భంగా భక్తులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు...సకల ఏర్పాట్లు: ఇఓ

శ్రీకాళహస్తి,జూలై 14 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన చెంగల్వరాయస్వామి ఆలయంలో ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 15 నుంచి ప్రారంభమౌతాయని ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి సోమవారం తెలిపారు. మంగళవారం ఆలయంలో వెలసిన చెంగల్వరాయస్వామి ఆలయం వద్ద అంకుర్పారణ కార్యక్రమాలు నిర్వహించబడుతుందని వివరించారు. అలాగే ఆలయానికి అనుబంధంగా ఉన్న విజ్ఞానగిరిపై వెలసిన కుమారస్వామి ఆలయంలో ఆడికృత్తిక మహోత్సవాలు నాలుగు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించుటకు ఏర్పాట్లు చేపడుతున్నామని ఆయన వివరించారు. ప్రధాన ఉత్సవాలు ఈ నెల 19 భరణితో ప్రారంభమౌతాయని వివరించారు. 20వ తేది ఆడికృత్తిక 21న స్వామి అమ్మవార్ల తెప్పోత్సవం, 22న కల్యాణోత్సవం నిర్వహించబడుతుందని ఇందుకు ఏర్పాట్లు చేపట్టినట్లు వివరించారు. కృతిక రోజు కుమారస్వామి కొండకు సుమారు లక్షమంది భక్తులు వస్తారని గతంలో రికార్డులు చెబుతున్నాయని కాబట్టి అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేసినట్లు ఇఓ వివరించారు.ఇప్పటికే కొండను ముస్తాబు చేస్తున్నామని నారదపుష్కరిణిలో నీరు ఎండిపోతుందని కాబట్టి పంపింగ్ చేస్తున్నామని వివరించారు.

**ఈ ఏడాది రెండు నెలల్లో ఆడికృత్తిక మహోత్సవాలు:**



ఈ ఏడాది తెలుగు రాష్ట్రాల్లో ఒక సారి తమిళరాష్ట్రంలో మరో నెలలో ఆడికృత్తిక వస్తుందని అర్చకులు తెలిపారు. అయితే శ్రీకాళహస్తిలో రెండు నెలల్లోనూ ఆడికృత్తిక మహోత్సవాల నిర్వహణకు సిద్ధం చేస్తున్నారు. శ్రీకాళహస్తిలో సుమారు 10నుంచి 15వేల మంది తమిళులుంటున్నారు. మంగళవారం నుంచి ప్రారంభమయ్యే ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు శ్రీకాళహస్తీశ్వరాలోని వల్లిదేవసేన సమేత చెంగల్వరాయ స్వామి ఆలయంలో మంగళవారం రాత్రి 7గంటలకు అంకుర్పారణతో ప్రారంభమౌతాయి. బుధవారం ధ్వజారోహణం జరుగుతుందని నిర్వాహకులు వివరించారు. ఉత్సవాలు ఆషాఢ బహుళ అమావాస్య వరకు జరుగుతాయని తెలిపారు.ఈ నెల 19న భరణి నుంచి విజ్ఞాన గిరిపై వెలసిన సుబ్రమణ్యం స్వామి ఆలయంలో ప్రధాన ఉత్సవాలు ప్రారంభమౌతాయని ఇఓ వివరించారు.